



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 261 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శుక్రవారం 12 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-




### నీటి ఆయోగ్ భేటీలో

# 'స్వర్ణాంధ్ర @2047' విజన్

- సీఎం చంద్రబాబు కీలక ప్రజంటేషన్
- మానవ వనరుల ఆధారిత అభివృద్ధి, టెక్నాలజీ పాలనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడి
- గత రెండేళ్లలో రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించామని స్పష్టం
- రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గుదలపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాలని విజ్ఞప్తి

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీ వేదికగా జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత భారత్ ఏ2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్‌ను ఆయన సభ్యుల ముందుంచారు. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని సంపన్న, సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మానవ వనరుల ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తామని చంద్రబాబు వివరించారు. దీని ద్వారా సంపూర్ణ పేదరిక నిర్మూలన, భారీ ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, జల, ఇంధన భద్రత కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వ్యవసాయ-టెక్, లాజిస్టిక్స్, డీప్-టెక్ వంటి రంగాలను అనుసంధానిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు. పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణలు, రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు, 'అవేర్' వంటి ముందస్తు అంచనా సాధనాలను వినియోగిస్తున్నామని, ఇవి మెరుగైన పౌర సేవలకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు, పారదర్శక విధానాలు, వ్యాపార అనుకూల వాతావరణం కారణంగా గత రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సభకు తెలియజేశారు. దీనివల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ కోసం అనారోగ్యకరమైన పోటీ తగదని హితవు పలికారు. కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడకుండా మౌలిక సదుపాయాల బలోపేతం, విధాన స్థిరత్వం, అనుమతుల వేగవంతం వంటి సుస్థిర అభివృద్ధి మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు. సమ్మిళిత అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని పునరుద్ఘాటించిన చంద్రబాబు, ప్రతి కుటుంబానికి ఇల్లు, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, స్వచ్ఛమైన వంట ఇంధనం, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలను అందిస్తామని తెలిపారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వినూత్న 'పీ4-ఎంబీకే 10-20' కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య రంగంలో 'ప్రాజెక్ట్ సంజీవని' ద్వారా నివారణ వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఏఐ ఆధారిత విద్యతో భవిష్యత్

మిగతా .. 2లో..



డీఎస్సీ మెరిట్ లిస్టులన్నీ

## ఇప్పటికీ వెబ్‌సైట్‌లోనే..


ఏపీ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. మెరిట్ లిస్టులన్నీ ఇప్పటికీ వెబ్‌సైట్‌లో ఉన్నాయని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. "హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని అర్థం చేసుకోలేక విమర్శలు చేస్తున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన అందరికీ ఉద్యోగాలు రావని నోటిఫికేషన్‌లోనే చెప్పాం. ఏకాంబరం అనే వ్యక్తికి 125 ర్యాంకు వచ్చింది.. అతను బీసీ 'డి' కేటగిరీకి చెందిన వ్యక్తి. ఆ కేటగిరీలో 110 ర్యాంకుల వరకూ ఉద్యోగాలు వచ్చాయి. ఆన్‌లైన్ విధానంలో అంతా పారదర్శకంగా ఉంటుంది. రిజక్షన్ లిస్టు అంటూ ఏదీ పెట్టలేదు" అని తెలిపారు.

### డీఎస్సీ స్కామ్‌పై

# సీబీఐ దర్యాప్తు జరిపించాలి

- మెగా డీఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందన్న వైఎస్ జగన్
- నియామక ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్
- స్పోర్ట్స్ కోటాలో అక్రమాలకు పాల్పడి తమవారికి ఉద్యోగాలిచ్చారని ఆరోపణ
- చంద్రబాబు, లోకేశ్‌లే ముద్దాయిలు కాబట్టి న్యాయం జరగదని వ్యాఖ్య



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం, దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.

**'మేమూ బొద్దింకలమే.. జనరేషన్ జెడ్ చూస్తోంది'**

ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా

మిగతా .. 2లో..

వారు గృహిణులు మాత్రమే కాదు..

## జాతి నిర్మాతలు

సుప్రీంకోర్టు



**విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబాన్ని నడిపే మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదని.. ఈ దేశాన్ని నడిపించే జాతి నిర్మాతలని సుప్రీం కోర్టు అభివర్ణించింది. వారు కేవలం ఇంటి పనులు మాత్రమే చేయడం లేదని, భావి తరాలను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంది. ఓ ప్రమాద కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "గృహిణి అంటే ఇంటిపెద్దపై ఆధారపడే వ్యక్తిగా పరిగణించడం విడ్డూరంగా అనిపిస్తోంది. ఎందుకంటే వాస్తవానికి

మిగతా .. 2లో..

### మెట్రో ఫేజ్-2 విస్తరణకు

# ఆమోదం తెలపండి

ప్రధానిని కోరిన తెలంగాణా సీఎం రేవంత్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణకు కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని ప్రధాని నరేంద్రమోదీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో ప్రధానితో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను మోదీ దృష్టికి తీసుకెళ్లారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా ఏపీ ప్రభుత్వంతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు

మిగతా .. 2లో..

## విశాఖ ఉక్కుపై వైకాపాకు మాట్లాడే హక్కు లేదు

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ ఉక్కుపై మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కును కాపాడేందుకు

మిగతా .. 2లో..

నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు..

## ఆ వార్తలు అబద్ధం

కారుమూరి నాగేశ్వరరావు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. "నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు.. ఉదయం నుంచి నేను ఇంట్లోనే ఉన్నాను. నా అరెస్ట్‌పై జరుగుతున్న ప్రచారమంతా పూర్తిగా అవాస్తవం" అని ఆయన స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ లిక్కర్ స్కాం కేసులో భాగంగా గురువారం హైదరాబాద్‌లో నిందితుల ఇళ్లలో ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు

మిగతా .. 2లో..

## బెంగాల్‌లో అగ్నిప్రమాదం

4,000 ఈవీఎంలు దగ్ధం



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రభుత్వ భవనంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు కాలిపోయాయి. బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ ఈ విషయాన్ని వెల్లడించారు. కోల్‌కతాలోని అలీపుర్ ప్రాంతంలో ఉన్న తొమ్మిది అంతస్తుల

మిగతా .. 2లో..

## ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తెదేపా నుంచి సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ.. జనసేన తరఫున లింగమనేని రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఆ నలుగురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## ఇరాన్‌పై దాడులను విరమించుకున్న ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై దాడులను విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శాంతి చర్చలకు ఇరాన్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. దీంతో ఇరాన్‌పై వైమానిక, బాంబు దాడులను రద్దు చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. ఇరు పక్షాల మధ్య కుదిరే ఒప్పందం, ప్రదేశం త్వరలోనే వెల్లడిస్తానని ట్రంప్ తెలిపారు.

రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి


## 14 రోజుల రిమాండ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణంపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిని ఈడీ అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. మద్యం రవాణాలో అవకతవకలతో నిందితులు ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలిగించినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ తెలిపింది. నిందితులు, వారి అనుచరులు అక్రమంగా ఆర్థిక లాభాలు పొందినట్లు గుర్తించింది.

### చురుగ్గా 'నైరుతి'..

## ఏపీలో పలు జిల్లాలకు వర్షసూచన



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. తెలంగాణ మీదుగా దక్షిణకోస్తాపై మరో ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఏర్పడింది. వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. "ఇవాళ అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశముంది. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, నంద్యాల, కడప, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో

మిగతా .. 2లో..

## నకిలీ ఇంటి పట్టాల దందా..

తురకా కిషోర్‌పై మాచర్లలో కేసు నమోదు!



**మాచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల రాజకీయాల్లో మరో సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. వైసీపీ నేత, మాచర్ల మాజీ మున్సిపల్ ఛైర్మన్ తురకా కిషోర్‌పై నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై మాచర్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిని చూపిస్తూ నిరుపేదలను నమ్మించి, డబ్బులు వసూలు చేసి ఈ మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది. మాచర్ల పట్టణం నెహ్రూ నగర్‌కు చెందిన

మిగతా .. 2లో..

### దమ్ముంటే 12 వైఫల్యాలపై

## జవాబివ్వండి

బీజేపీపై వైఎస్ షర్మిల ఫైర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యసభ సీటు గురించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభ సీటు అనేది

మిగతా .. 2లో..

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో

## మరో ప్రమాదం

తప్పిన ముప్పు




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో వరుసగా జరుగుతున్న ఘటనలు కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన భారీ ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషాదం ఇంకా మరువక ముందే.. ఈ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ప్లాంట్‌లో మరో ప్రమాదం చోటుచేసుకుంది. భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. ఎస్ఎమ్ఎస్-1 విభాగంలోని ఆర్గాన్ రిన్సింగ్ స్టేషన్ వద్ద లాడిల్ నుండి ద్రవ ఉక్కు ఒక్కసారిగా లీకైంది. అయితే, లీకేజీ

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### నీటి ఆయోగ్ భేటీలో

# 'స్వర్ణాంధ్ర @ 2047' విజన్

అవసరాలకు యువతను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, జనాభా సుస్థిరతపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత, వృద్ధాప్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. సహకార సమాఖ్య స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని, 'వికసిత భారత్ 2047' అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

# సీబీఐ దర్యాప్తు జరిపించాలి

ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.

**అక్రమాలపై జగన్ వివరణ**

డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తేలుతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా స్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.

**సీబీఐ విచారణే శరణ్యం**

తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వారు గృహిణులు మాత్రమే కాదు.. జాతి నిర్మాతలు

ఓ కుటుంబమంతా నిత్యం ఆమెపైనే ఆధారపడుతోంది. కానీ, ఆమె విలువకు తగిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాల్లో మహిళలు విజయం సాధిస్తున్నప్పటికీ.. ఇంటి పనుల విషయంలో ఆమెను ఇప్పటికీ తక్కువగానే అంచనా వేస్తున్నాం. కానీ, ఆమె లేకపోతే ఇంట్లో ఎన్నో పనులు ఆగిపోతాయి. ఆమె చేసే పని వెలకట్టలేనిది. కానీ, ఒకవేళ దాన్ని ఆర్థికంగా లెక్క కడితే.. నెలకు కనీసం రూ.30వేల కంటే ఎక్కువే అవుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జీతం లేకుండా మహిళలు చేసే ఇంటి పనులు.. దేశ జీడీపీలో 15-17 శాతం వాటాకు సమానమనే అంచనాలున్నాయి. అయినప్పటికీ ఆమెకు మనం ఎలాంటి వేతనం చెల్లించడం లేదు సరికదా.. వారికి సరైన గుర్తింపు కూడా లభించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా వివాహ వ్యవస్థలో అనాదిగా వస్తోన్న ఆచారాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. "పెళ్లంటే పనుల కోసం ఓ మనిషిని నియమించుకోవడం కాదు. ఇంటి పనుల బాధ్యత ఆడవాళ్లదే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటోంది. కానీ, ఇందులో దంపతులిద్దరికి సమాన బాధ్యత ఉంటుంది. వివాహం జరిగిందన్న కారణంతో ఓ మహిళ తన కలలను, లక్ష్యాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదు. పెళ్లి అంటే.. మహిళ గుర్తింపునకు ముగింపు కాదు" అని ధర్మాసనం అభిప్రాయపడింది. పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిహారం కోరుతూ ఆమె భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆమె కుటుంబానికి రూ.2.42లక్షల పరిహారం ఇవ్వాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాధిత కుటుంబం పంజాబ్, హరియాణా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అనంతరం ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది.

### చురుగ్గా 'నైరుతి'..

# ఏపీలో పలు జిల్లాలకు వర్షసూచన

ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే వీలుంది. కొన్నిచోట్ల గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముంది" అని వాతావరణ కేంద్రం తెలిపింది.

**తెలంగాణలోనూ..**

తెలంగాణలోనూ పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే వీలుందని వెల్లడించింది. రేపు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# నకిలీ ఇంటి పట్టాల దందా..

విజయాబాయి, శ్రీను నాయక్ అనే బాధితులు తమకు జరిగిన అన్యాయంపై స్థానిక తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో.. అంటే 2019వ సంవత్సరంలో మాచర్ల రింగు రోడ్డు సమీపంలోని గ్యాస్ గోదాము ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమికి తురకా కిషోర్ తన బంధువైన చల్లా శివ ద్వారా నకిలీ పట్టాలు తయారు చేసి ఇచ్చారని బాధితులు ఆరోపించారు. స్థలాల కోసం తాము పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించినప్పటికీ, చేతికి మాత్రం నకిలీ కాగితాలు ఇచ్చి మోసం చేశారని వారు ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా రెవెన్యూ, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రెవెన్యూ సిబ్బంది రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో బాధితులకు ఇచ్చిన పట్టాలు ముమ్మాటికీ నకిలీవని, ఆ భూమి ప్రభుత్వానికి చెందినదని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఆరోపణల్లో నిజముందని తేలడంతో, రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగా మాచర్ల పోలీస్ స్టేషన్‌లో మాజీ మున్సిపల్ ఛైర్మన్ తురకా కిషోర్, అతడికి సహకరించిన చల్లా శివపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ నకిలీ పట్టాల కుంభకోణంపై పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి నకిలీ పట్టాల దందాలు ఇంకా ఎక్కడెక్కడ జరిగాయనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు.

# దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన వ్యక్తిగత విషయమని, మధ్యలో బీజేపీ నేతల అసహనం, అతి స్పందన ఎందుకని షర్మిల ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక అర్థం పర్థం లేని అంశాలను తెరపైకి తెచ్చి బీజేపీ తన సంస్కారాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన 12 వైఫల్యాలపై చర్చకు రావాలని, పుండు మీద కారం చల్లే చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. "రైళ్లు, రహదారులు అని గొప్పలు చెప్పడం కాదు, నిత్యావసరాల ధరలు 300 శాతం ఎందుకు పెరిగాయో చెప్పాలి. అతిపెద్ద స్టార్టప్ దేశమని చెప్పుకోవడం కాదు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. డీబీటీల గురించి కాదు, దేశవ్యాప్తంగా 28 సార్లు జరిగిన పేపర్ లీకుల గురించి మాట్లాడాలి. మహిళా సాధికారిత అని సమర్థించుకోవడం కాదు, ఏటా జరుగుతున్న 5 లక్షల అఘాయిత్యాలపై జవాబివ్వాలి" అని ఆమె నిలదీశారు. అంతేకాకుండా, దేశ ఆర్థిక పరిస్థితిపైనా షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. "తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం ఇవ్వాలి. దేశీయ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే, డాలర్‌తో రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనమైంది? పీఎం కిసాన్ నిధులతో రైతులను ఆదుకుంటే, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?" అని ఆమె ప్రశ్నించారు. విభజన రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు' ఉందని షర్మిల ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేది ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని, ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతున్నంత కాలం బీజేపీకి ప్రజాభిమానం లభించదని, వారికి దక్కేవి దొంగ సర్టిఫికెట్లు మాత్రమేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ అంకితభావంతో ఉందని, ప్రజా ఉద్యమ గొంతుక తమదేనని షర్మిల స్పష్టం చేశారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో మరో ప్రమాదం

జరిగిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో మరో పెద్ద ప్రాణ నష్టం, ముప్పు తప్పినట్లయింది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అలాంటి ఘటన పునరావృతం కావడంతో స్టీల్ ప్లాంట్ కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జూన్ 8న ఎస్ఎంఎస్-2 విభాగంలో లాడిల్ నుండి ద్రవ ఉక్కు పొంగిపొర్లడం వల్ల 9 మంది అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మరణాల నేపథ్యంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా అందించింది. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

# ఆ వార్తలు అబద్ధం

నిర్వహించారు. ఈ క్రమంలోనే మద్యం రవాణా కాంట్రాక్టు, టెండర్ల వ్యవహారంలో జరిగిన అక్రమాల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డిని అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావును కూడా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తన అరెస్ట్ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

### మెట్రో ఫేజ్-2 విస్తరణకు

# ఆమోదం తెలపండి

సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఆర్ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని సీఎం వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి-మచిలీపట్నం పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వేతో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల అంశాన్ని కూడా సీఎం రేవంత్ ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్య, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీని సీఎం కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని.. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందన్నారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, మూసీ ప్రక్షాళన, పట్టణ అభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

# విశాఖ ఉక్కుపై వైకాపాకు మాట్లాడే హక్కు లేదు

రూ.13 వేల కోట్ల ప్యాకేజీ మంజూరు చేయించామని గుర్తు చేశారు. పరిశ్రమ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. యూరియా అధిక వినియోగం ప్రమాదకరమని, ఈ ఏడాది నుంచి కొత్తగా యాప్ విధానం అమలు చేస్తున్నామన్నారు. దాని ద్వారా ఎంత యూరియా అవసరమనేది గుర్తించి ముందస్తుగానే స్లిప్ ఇస్తామని, ఎక్కడ కావాలంటే అక్కడ పొందవచ్చునన్నారు.

# బెంగాల్‌లో అగ్నిప్రమాదం

భవనంలో బుధవారం మంటలు చెలరేగాయి. ఈ భవనంలో ఆయా ప్రభుత్వ విభాగాలతోపాటు దక్షిణ 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యాలయం కూడా ఉంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బందికి 24 గంటలకుపైగానే సమయం పట్టిందట. ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి కౌశిక్ మాట్లాడుతూ.. "అగ్ని ప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు కాలిపోయాయి. ఈ ఈవీఎంలను ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 నియోజకవర్గాల్లో ఉపయోగించారు. ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా కనిపించడం లేదు. ఏదైనా కుట్ర జరిగిందా? అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం. భవనంలోని రెండో, మూడో అంతస్తుల్లో మొదట మంటలు కనిపించాయి. మధ్యలో ఉన్న అంతస్తులపై ఎలాంటి ప్రభావం చూపకుండా.. తొమ్మిది, పదో అంతస్తులకు అవి ఎలా వ్యాపించాయనేది స్పష్టంగా తెలియరాలేదు. దీనిపై విచారణ జరుగుతోంది. ఫోరెన్సిక్ నివేదిక అనంతరం స్పష్టత వస్తుంది" అని తెలిపారు. దక్షిణ 24 పరగణాల యంత్రాంగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన వెనుక కుట్ర కోణాన్ని కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ పేర్కొన్నారు. అయితే.. ఫోరెన్సిక్ పరీక్షలు, శాస్త్రీయ ఆధారాలతోనే నిర్ధారణకు వస్తామని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఆ భవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు, మౌలిక సదుపాయాలు, భద్రతా వ్యవస్థలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు.

# జగన్ నిజంగానే ఓ 'కాక్రోచ్'.. అందుకే ప్రజలు 'హిట్' కొట్టి తరిమేశారు

## చంద్రబాబుపై విమర్శలు చేసే అర్హత జగన్‌కు లేదన్న కంచర్ల శ్రీకాంత్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్ నిజంగానే ఒక బొద్దింక (కాక్రోచ్) లాంటి వారని, అందుకే 2024 ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే 'హిట్'తో గట్టిగా కొట్టి సమాధానం చెప్పారని టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి మాట్లాడే కనీస అర్హత కూడా జగన్‌కు లేదని ఆయన మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. జగన్ చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. తీవ్ర అక్రమాలకు పాల్పడిన జగన్ ఇవాళ నీతులు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. అమరావతి నిర్మాణం కోసం 2014 నుండి కన్న కలలను నాశనం చేయడానికే జగన్ విషప్రచారం చేస్తున్నారని, ఆయన ఇప్పుడు రోడ్లపైకి వస్తే ప్రజలు కొట్టేలా ఉన్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు సమయంలో పూర్తి చేసిన మెగా డీఎస్సీపై జగన్ రెడ్డి చేస్తున్న నిరాధార ఆరోపణలు 16 వేల నిరుద్యోగ కుటుంబాల ఉసురు పోసుకోవడమేనని శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. "12 ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూసి, రాత్రింబగళ్లు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలపై జగన్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. గొడ్డలి పార్టీ నేతల తప్పుడు ఆరోపణల వల్ల డీఎస్సీ అభ్యర్థులు మానసిక క్షోభకు గురవుతున్నారు. వారి ఉసురు జగన్‌కు తగలకుండా పోదు" అని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు ఆధారాలతో సహా వివరణ ఇస్తున్నా, జగన్ అవే అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని, ఆనాడు ఉద్యోగాలు రాక 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ పాపం జగన్‌దేనని శ్రీకాంత్ ఆరోపించారు. "'నాడు-నేడు' పేరుతో విద్యాశాఖలో భారీగా దోచుకున్నారు. జీఓ 117 తెచ్చి 12 లక్షల మంది పేద పిల్లలను బడులకు దూరం చేశారు. కల్తీ మద్యంతో రూ.3,500 కోట్లు దోచుకుని 30 వేల మంది మహిళల మాంగల్యాలు తెంచిన జగన్.. ఇప్పుడు నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది" అని విమర్శించారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం తల్లిని, చెల్లిని వాడుకుని కన్నీళ్లతో ఇంటి నుంచి, పార్టీ నుంచి తరిమేసిన చరిత్ర జగన్‌దని శ్రీకాంత్ అన్నారు. అబద్ధాల పునాదులపై పుట్టిన వైసీపీ, శివకుమార్ నుంచి పార్టీని లాక్కొని ఆయనకే వెన్నుపోటు పొడిచిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ 240 దొంగ కేసులు వేసినా, వాటన్నింటినీ అధిగమించి నియామకాలు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా జగన్‌కు శ్రీకాంత్ పలు సవాళ్లు విసిరారు. "మీ దగ్గర సుప్రీంకోర్టు స్థాయి లాయర్లు ఉన్నారు కదా? దమ్ముంటే డీఎస్సీపై కోర్టులో కేసులు వేసి విచారణ జరిపించుకోవాలి. ప్రెస్ మీట్లు పెట్టి విషం కక్కడం దేనికి? మీ డిగ్రీ సర్టిఫికెట్లు ప్రజలకు చూపించే ధైర్యం ఉందా?" అని ప్రశ్నించారు. అంతేకాకుండా, "మీడియా ముందు విమర్శలు చేయడం కాదు, దమ్ముంటే ఢిల్లీ లేదా ముంబైలో జరిగే ఏదైనా జాతీయ స్థాయి కాన్‌క్లేవ్‌లో మంత్రి నారా లోకేష్‌తో రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధిపై ముఖాముఖి చర్చకు రావాలి. మేము సిద్ధం, మీరు డేట్ చెప్పండి" అని కంచర్ల శ్రీకాంత్ సవాల్ విసిరారు.

### నౌకపై అమెరికా దాడి..

# ముగ్గురు భారతీయులు మృతి

### ధ్రువీకరించిన కేంద్ర మంత్రి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా బుధవారం జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మారివెక్స్ నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే.

**మరో నౌకపై దాడి..**

ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారం రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. "ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం" అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవీర్ అని తెలుస్తోంది.

## ఎడిటర్ వాయిస్

# ఆమంచి - కరణం..
# పొలిటికల్ కుస్తీ..!

నువ్వొస్తానంటే.. నేనొద్దంటానా? అని ఓపార్టీ, ఉన్నదిలే.. టైమున్నదిలే.. అని మరో పార్టీ.. ఇలా.. ఇద్దరు నాయకులు పెట్టుకున్న ఆశలపై.. రెండు కీలక పక్షాలు.. వ్యవహరిస్తున్న తీరు చీరాల రాజకీయాల్లో ఆసక్తి గా మారుతున్నాయి. ఆ ఇద్దరు నేతలూ కూడా ఫైర్ బ్రాండ్సే. ఇద్దరూ మాజీ ఎమ్మెల్యేలే. వారే ఆమంచి కృష్ణమోహన్. కరణం బలరామకృష్ణమూర్తి. ఇద్దరూ కూడా ఇప్పుడు పొలిటికల్ సెంటర్‌లో నిలిచిపోయారు. ఎటూ వారు కదలడం లేదు.

గత ఎన్నికల్లో తాను వదులుకుని.. తన సీటును కుమారుడికి ఇచ్చారు కరణం. కానీ, ఫలితం దక్కలేదు. పైగా.. 20 వేలకు పైగా ఓట్ల తేడాతో వైసీపీ నుంచి పోటీచేసిన కరణం వెంకటేష్ పరాజయం పాలయ్యారు. ఇక, ఆ తర్వాత.. వైసీపీకి దూరమయ్యారా? చేరువలో ఉన్నారా? అన్నది పెద్ద క్వశ్చన్ మార్క్. ఇక, ఇప్పుడు టీడీపీలో చేరిపోయి.. వచ్చే ఎన్నికలలో టికెట్ దక్కించుకుని తీరాలన్నది కరణం వెంకటేష్ ప్రయత్నం. కానీ, టీడీపీ నుంచి టైమున్నదిలే.. అంటూ సమాచారం వస్తోంది.

ఇక, ఆమంచి కృష్ణమోహన్.. అనుకున్నది సాధించలేక పోయిన విషయం తెలిసిందే. తనకు ప్రజల మద్దతు ఉందని ఆయన భావించారు. ఇది నిజమే 2014 ఎన్నికల్లో నవభారత్ పార్టీ తరఫున పోటీచేసినా ఆయనను ప్రజలు గెలిపించారు. 2019లో వైసీపీ తరఫున మాత్రం ఓడించారు కానీ, స్థానికంగా పట్టుందని.. స్థానిక సంస్థల ఎన్నికలు రుజువు చేశాయి. కానీ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన ఆయన.. పరాజయం పాలయ్యారు. ఇక, ఇటీవల వరకు కాంగ్రెస్‌లోనే ఉన్నా.. ఇప్పుడు రూటు మారుస్తున్నారు.

ఈ క్రమంలో నువ్వొస్తానంటే.. నేనొద్దంటానా? అంటూ.. వైసీపీ కూని రాగాలు తీస్తున్న పరిస్థితి. కానీ, ఆమంచి ఇంకా డిసైడ్ కాలేదట. ఎన్నికలకు ముందు వరకు.. వేచి చూడాలన్నది ఆయన వ్యూహం. కాంగ్రె స్‌లో ఉంటే.. రెండు రకాలుగా తనకు మంచిదని ఆయన అంచనా వేసుకుంటున్నారట. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే ఉండి. తర్వాత.. ఎన్నికల నాటికి -నిర్ణయం- ప్రకటించనున్నారన్నది పొలిటికల్ టాక్. మరి ఏం జరుగుతుందో చూడాలి. ఏదేమైనా.. ఆమంచి-కరణం.. పొలిటికల్ కుస్తీ పడుతున్నారని చీరాల టాక్ జోరుగా నడుస్తుండడం గమనార్హం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

### గెద్దాడ హైవేపై ఎదురు ఎదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ



**గెద్దాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పాశర్లపూడి - శివకోడు జాతీయ రహదారిపై గెద్దాడ సమీపంలోకి రాగానే అతివేగంగా రావడంతో బలంగా ఢీకొన్న రెండు కార్లు. ఒక కారు పల్టీ కొట్టటంతో స్వల్ప గాయలతో బయటపడ్డ కారులో ఉన్న ప్రయాణికులు... అతి వేగమే ప్రమాదానికి కారణంగా ప్రాథమిక సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### పంజాగుట్ట ఏఎస్సై ఖాతా నుంచి డబ్బు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పంజాగుట్ట పీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న నరసయ్య సైబర్ మోసానికి గురయ్యారు. ఆర్టీఏ చలాన్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఆయనకు ఏపీకే ఫైల్ పంపించారు. తద్వారా నరసయ్య బ్యాంకు ఖాతా నుంచి రూ.49,139 దోచుకున్నారు. ఈనెల 8న తన మొబైల్ ఫోన్‌కు పలుమార్లు మెసేజ్‌లు వస్తుండటంతో ఏఎస్సై పరిశీలించారు. తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కట్ అవుతున్నట్లు గుర్తించారు. తన ప్రమేయం లేకుండా నగదు పోతుండటంతో ఆందోళనకు గురై సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఏసీబీ అదుపులో ఐసీడీఎస్ ఉద్యోగి



**కరీంనగర్ మంకమ్మతోట, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న దనుక రాధికను కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక బినామీ ఖాతాల ద్వారా కాంట్రాక్టర్ల నుంచి అక్రమ కమీషన్లు వసూలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు, పప్పు తదితర సరకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్ల బిల్లుల క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్ చేశారు. లంచం డబ్బులు తీసుకోవడానికి కుటుంబసభ్యులు, అదే శాఖలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మధ్యవర్తులుగా వాడుకున్నారు. 2022 జూన్ నుంచి 2024 ఏప్రిల్ మధ్య వివిధ రూపాల్లో మొత్తం రూ.2,37,500లను లంచాలుగా తీసుకున్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు ఆమెను ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇదే విషయంపై ఏడాదిన్నర కిందట సామాజిక కార్యకర్తల పేరిట కొంతమంది మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా విచారించాలని అప్పటి కలెక్టర్‌ను ఆయన కోరారు. అందులో భాగంగా ఏసీబీ అధికారులు లోతుగా విచారణ జరిపినట్లు సమాచారం.

### హత్య కేసులో 13 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

**పొదిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం జిల్లా, పొదిలి మండలం రాజుపాలెం గ్రామ సమీపంలో 2017లో జరిగిన కంచర్ల శ్రీను హత్య కేసులో 13 మందికి యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ బుధవారం మార్కాపురం ఆరో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జస్టిస్ వేల్పుల భవాని తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. అప్పట్లో గ్రామంలో బొడ్రాయి వద్ద ప్రారంభమైన విభేదాలు చినికిచినికి గాలివానలా మారాయి. గ్రామ రాజకీయాలు, కుల విభేదాలు, గ్రామంలోని వ్యవహారాల విషయాలపై కంచర్ల శ్రీను, నిందితులకు మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయి.

**కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో దాడి..**

నిందితులంతా ఓ ప్రణాళిక ప్రకారం 2017 మే 17వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పొదిలి నుంచి రాజుపాలేనికి మోటారు సైకిల్‌పై వెళుతున్న కంచర్ల శ్రీనును రాజుపాలెం గ్రామ శివారులో గొడ్డళ్లు, కత్తులు, ఇనుప రాడ్లతో దాడిచేసి చంపారు. మృతుని భార్య కె.కాశీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తొమ్మిదేళ్లపాటు విచారణ జరిగింది. ప్రధాన నిందితులుగా గుర్తించిన 13 మందిని దోషులుగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. నిందితుల్లో 12 మంది రాజుపాలెం గ్రామానికి చెందిన వారుకాగా ఒకరు కొత్తపాలేనికి చెందిన వ్యక్తి. నిందితులను నెల్లూరు కారాగారానికి తరలించినట్లు పొదిలి సీఐ ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు.

**వైసీపీ నేత తురకా కిషోర్‌పై**

### మాచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు




**పల్నాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత తురకా కిషోర్‌పై మాచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు..! నకిలీ ఇళ్ల పట్టాతో మోసం చేసిన ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు. రూ.4.50 లక్షలు తీసుకుని నకిలీ పట్టా ఇచ్చారని ఎమ్మెల్యేకు విజయా బాయి, శ్రీను నాయక్ ఫిర్యాదు. విచారించాలని రెవెన్యూ సిబ్బంది, పోలీసులను ఆదేశించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి. విచారణలో మోసం చేసినట్లు తేలడంతో.. తురకా కిషోర్, అతని బంధువు చల్లా శివపై కేసు నమోదు చేసిన పోలీసులు.

### ఓఆర్ఆర్‌పై లారీ దగ్ధం



**దుండిగల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓఆర్ఆర్‌పై దుండిగల్ వద్ద లారీ దగ్ధమైంది. ఎగ్జిట్ నంబర్ 5 వద్ద లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతంలో పొగ దట్టంగా వ్యాపించడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

### దుండిగల్‌లో తాళం వేసిన ఇళ్లలో చోరీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బౌరంపేటలో వరుస దొంగతనాలు కలకలం రేపాయి. గురువారం తెల్లవారు జామున తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. రూ.35000 నగదు, 3.5 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మరో ఇంట్లో రూ.1.30 లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగుడు దొంగతనానికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వాటి ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యం

**కామారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లితోపాటు ముగ్గురు చిన్నారులు అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణంలో కలకలం రేపింది. లయ(31), శివ(13), బిందు(16), దివిజ(8) కనిపించడం లేదని వారి బంధువులు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాలతోనే నలుగురూ ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

### ఖమ్మం సోనోవిజన్ షోరూమ్‌లో భారీ చోరీ

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** జడ్పీ కార్యాలయం సమీపంలోని సోనోవిజన్ షోరూంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి షోరూం తాళాలు పగులగొట్టి చొరబడిన దొంగలు రూ.కోటి విలువైన వందకుపైగా సెల్‌ఫోన్లు అపహరించారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు ఖమ్మం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

### ఊటీలో వాహనం బోల్తా... విశాఖ వాసులకు గాయాలు

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులోని ఊటీలో బుధవారం ఓ టూరిస్ట్ వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో విశాఖకు చెందిన 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలోని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని 22 మంది సభ్యులు మైసూరు, ఊటీ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించి... బుధవారం తిరిగి విశాఖకు పయనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న వాహనం నీలగిరి జిల్లా కూనూర్ ఘాట్రోడ్డులోని నందగోపాల్ వంతెన వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 14 మందిని కూనూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూనూర్ పోలీసులు వెల్లడించారు.

# సెకండ్ ఛాన్స్ ఇస్తున్నాం!

## వనిత వాయిస్



**వయసు పెరగడమంటే అనుభవాన్ని పోగేసుకోవడమే! ఒకప్పుడు అలాంటి పెద్దవాళ్లు ఇంట్లో ఉంటే నిశ్చింత. ఇప్పుడు వాళ్లని పట్టించుకోవడమే మానేస్తున్నారు. కాబట్టే, వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోతున్నవాళ్లే ఎక్కువ. అలాంటివాళ్లకి జీవితంలో 'రెండో అవకాశం' ఇస్తున్నారు మతీన్ అన్సారీ.**

ఒకప్పుడు అన్నీ ఉమ్మడి కుటుంబాలే. పెద్దవాళ్లంటే ప్రేమకు నిలయాలుగా ఉండేవి. అలాంటి వాతావరణంలోనే పెరిగాన్నేను. పుట్టిపెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నిజాం కాలేజీ నుంచి డిగ్రీ పూర్తిచేశా. 18 ఏళ్లకే పెళ్లైంది. మావారు హబీబ్ అన్సారీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి జడ్జిగానూ చేశారు. ఆయన కోల్‌కతాలో పనిచేస్తున్నప్పుడు అక్కడ కొందరు పెద్దవాళ్లని చూశా. మాట్లాడేవాళ్లు లేక ఒంటరితనంతో బాధ పడేవారు. సంపాదన లేక నిరాదరణకు గురయ్యేవారు. మాదీ పెద్ద కుటుంబమే. ఇంట్లోవాళ్లంతా లాయర్లు, అడ్మినిస్ట్రేటర్లుగా పనిచేశారు. అమ్మమ్మ, నానమ్మల్ని ప్రేమగా చూసుకునేది మా అమ్మ. అది చూస్తూ పెరిగిన నాకు ఈ తీరు ఆశ్చర్యపరచడమే కాదు... నాపై చాలా ప్రభావాన్నీ చూపింది. కొన్నేళ్లయ్యాక మా మనవళ్లు, మనవరాళ్ల కోసం అమెరికా వెళ్లా. అప్పటికి నాకు 50 ఉంటాయేమో! నేనూ వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్నా కదా... నా ప్రయాణం ఎలా సాగుతుందోనన్న కుతూహలం కలిగింది. అందుకే అక్కడే కొన్ని కోర్సులు చేశా. అవి నా దృక్పథాన్ని మార్చాయి. దీంతో వయసు పెరిగేకొద్దీ జరిగే శారీరక, మానసిక, భావోద్వేగ మార్పుల గురించి లోతుగా తెలుసుకోవడానికి యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా నుంచి జెరెంటాలజీలో మాస్టర్స్‌నీ పూర్తిచేశా. నన్ను నేను అర్థం చేసుకున్నాక ఇతరులకోసం 'దొబారా' ప్రారంభించా. ఈ పేరుని మా అమ్మాయి సమీన్ సూచించింది.

**అందుకే ఆ పేరు**

నేర్చుకోవడం, స్నేహితుల్ని ఏర్పరచుకోవడం, ఆస్వాదించడం... ముఖ్యంగా జీవితాన్ని కొత్త కోణంలో చూడటానికి ప్రతి ఒక్కరికీ మరో అవకాశం దొరకాలి అన్నది నా ఉద్దేశం. అందుకే అదే అర్థమొచ్చేలా 'దొబారా' అని పెట్టాం. నిజానికి సేవలు 2014లోనే ప్రారంభించినా ఫౌండేషన్‌ని 2017లో రిజిస్టర్ చేయించా. మాది వృద్ధాశ్రమం కాదు.



వయసు పైబడిన వాళ్లు తిరిగి జీవితాన్ని ఆస్వాదించడానికీ, సృజనాత్మకతను పంచుకోవడానికీ, తమకేం కావాలో తెలుసుకోవడానికీ సాయపడే వేదిక. పదవీ విరమణ పొందాక చూడండి... పలకరింపులు తగ్గుతాయి. మనవళ్లు, మనవరాళ్లు, పిల్లలు ఎవరి పనుల్లో వాళ్లు బిజీ. దీంతో చాలామంది ఆర్థికంగా స్థిరపడినా, అన్ని సౌకర్యాలున్నా పలకరించేవాళ్లు లేక ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. వాళ్లలో దీన్ని పోగొట్టి ఆనందంగా, నలుగురి మధ్యా గడిపేలా చేయడమే మా ప్రధాన లక్ష్యం. మార్నింగ్ వాక్స్, పిక్నిక్‌లు, బుక్ రీడింగ్, తంబోలా సెషన్లు, పాట్‌లక్ లంచ్‌లు, బోర్డు గేమ్‌లు ఆడించడం, ఆర్ట్, క్రాఫ్ట్, మొక్కల పెంపకం... వంటివెన్నో నిర్వహిస్తుంటాం. సహాయకులను సూచించడం, సీనియర్ కమ్యూనిటీలతో కలిసేలా చేయడం, భావోద్వేగపరంగా అండ, లీగల్, సామాజిక అంశాల్లో సాయం వంటివీ అందిస్తాం. సభ్యుల నుంచి వార్షికంగా నామమాత్రపు ఫీజు తీసుకుంటాం. మాకు వలంటీర్లూ ఉన్నారు. దొబారా అల్మారి అనే సస్టెయినబుల్ సంస్థ ఉంది. అక్కడ పాత వస్తువులను రీసైకిల్, అప్‌సైకిల్ చేసి అమ్ముతాం. వాటితో నిధులు సమకూర్చుకుంటాం.

**అదే ఆనందం...**

ఇప్పటివరకూ 8వేలకుపైగా మందికి సాయపడ్డాం. మా ప్రోత్సాహంతో తమలోని ప్రతిభను గుర్తించుకున్న వారెందరో. కవితలు, అల్లికలు, పాటలు పాడటం, ఆర్ట్స్ ఇలా ఎన్నో కొత్తగా ప్రయత్నిస్తున్నారు. కొందరు యువతకు మార్గనిర్దేశం చేస్తున్నారు. వివిధ అంశాల్లో వలంటీర్లుగా చేస్తున్నారు. శారీరక వైకల్యం ఉన్నా... ఇతరులకు మానసికంగా అండగా ఉండటానికి ప్రయత్నిస్తున్న పెద్దవాళ్లు ఉన్నారు. ఇలా జీవితాన్ని మరోసారి కొత్తగా తీర్చిదిద్దుకున్న వాళ్లు చాలామందే! పెద్దవాళ్లని చాలామంది ఏం తెలియదు అని కొట్టిపారేస్తారు కానీ... నడిచొచ్చే చరిత్ర వాళ్లు. అందుకే సంస్కృతి, వాళ్లు చూసిన మార్పులు, ఎదుర్కొన్న సమస్యలు వంటివి ఈ తరానికీ తెలియాలనే పిల్లలతో వాళ్లని కలిపిస్తుంటాం. సహానుభూతిని పరిచయం చేయాలి, పెద్దవాళ్లతో గడిపేలా చేయాలని స్కూలు పిల్లలతోపాటు వృద్ధులనూ వృద్ధాశ్రమాలు, ప్రభుత్వాసుపత్రులకు తీసుకెళతాం. ఈక్రమంలో ఎన్నో పురస్కారాలూ అందుకున్నా. అయితే పెద్దవాళ్ల ముఖాల్లో తిరిగి ఆనందం, వాళ్లు ఒకరికొకరు అండగా నిలవటం, సంతోషంగా వృద్ధాప్యాన్ని ఆస్వాదించడం చూసినప్పుడు కలిగే సంతృప్తే వేరు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ దోహదం

**యోగ విద్య విలువ ప్రతి ఒక్కరికి తెలియాలి**
**శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగాలో కోర్స్ పూర్తి చేసిన 36 మంది విద్యార్థులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యోగ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం, మానసిక శారీరక ఆరోగ్యానికి అతి ముఖ్యమైన యోగవిద్య విలువ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని యోగ చైతన్య సంస్థ ట్రస్ట్ బోర్డు మెంబర్ డాక్టర్ ఎం.వి.జి.ఎస్.శర్మ అన్నారు. యోగా చైతన్య సంస్థ గోదావరి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగ కళాశాలలో 36 మంది యోగ విద్యను పూర్తి చేసుకున్నారు శ్రీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ తో నడుస్తున్న ఈ కళాశాల వ్యాలిడిక్టరీ ఫంక్షన్ ఘనంగా జరిగింది ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎం వి జి ఎస్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యోగ విద్యకు ప్రాధాన్యత పెరుగుతూ వస్తుందన్నారు. అనుష్టాన యోగ వేదాంత శిక్షణ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. అందులో భాగంగా శ్రీ రాపర్తి రామ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ యోగ అను కళాశాలను ఏర్పాటు చేసి పీజీ డిప్లమా ఇన్ యోగ అనే కోర్సు ద్వారా సమాజానికి ఉన్నతమైన యోగా టీచర్లను అందించడం జరుగుతుం దని పేర్కొన్నారు. యోగం తాలూక యొక్క మూలాలను, మహర్షులు చెప్పిన యోగ విద్య గొప్పతనాన్ని, ఆధ్యాత్మిక ఉన్నతకి యోగం ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలిపారు. ఈ సభకు అధ్యక్షులుగా ప్రిన్సిపల్ ఎన్. శివ శంకర్ రావు సభను ఉద్దేశించి ప్రస్తుత కాలంలో శారీరక మానసిక అనారోగ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగమే శరణ్యమని, యోగ సాధన చేయడం ద్వారా మనిషి లోపల అరిషడ్ వర్గాలు నశించి మానవుడు దైవంగా మార్చగల మహోన్నతమైన సాంప్రదాయ విద్య యోగవిద్య అని అభివర్ణించారు. యోగా గురువు కె అర్జున్, ఎన్ కిరణ్ కుమార్, కె హరీష్,సత్యవాణి, ఆశ, ఉషా కాంతి వంటి యోగా టీచర్ల ప్రసంగాలతో ఈ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. ఇప్పటివరకు శ్రీ రాపర్తి రామ ఇన్నిటిట్యూట్ ఆఫ్ యోగ వారిచే 400 మంది పైచిలుకు యోగా టీచర్లు విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో యోగా విద్య అభ్యసించిన వారు సూరపరెడ్డి తాతారావు, పద్మనాభం, మహేంద్ర నాథ్, యూనివర్సిటీ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, కెవి సుబ్రహ్మణ్యం, సుష్మ, భార్గవి, విద్యార్థులందరూ కలిసి వ్యాల్డిటరీ ఫంక్షన్ని విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్పై బిఎల్ఏలకు అవగాహన సదస్సు

**రాజకీయ పార్టీలు ప్రజలు సహకరించాలి : డిప్యూటీ కలెక్టర్ టీఆర్ రాజేశ్వరరావు**





**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేటలో త్వరలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీఆర్ రాజేశ్వరరావు కోరారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల కమిషన్ సర్ ప్రోగ్రామ్ను చేపట్టిందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో సహాయ ఓటరు నమోదు అధికారి, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరరావు హాజరై ఎస్ఐఆర్పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేని ఓటర్ లను తొలగించడం, కొత్త ఓటర్లను చేర్పించడం, అవసరమైన ఓటర్ల అభ్యర్థుల మేరకు మార్పులు చేర్పులు చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామంటూ ఆయన చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి నియమితులైన బూత్ లెవెల్ ఏజెంట్లు ను తమ వెంట తీసుకువెళ్తామని వారి సమక్షంలోనే కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తెలుగుదేశం, వైఎస్సార్సీపీ, బీజేపీ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లకు కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పిపి మెహర్బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం పద్మనాభం, బూత్ లెవెల్ అధికారి ఎన్ నాగశివ, ఎన్నికల ఆపరేటర్లు జి.ఆంజనేయులు, జి.వెంకటరావ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## జస్టిస్ బాలకృష్ణ కమిషన్ను కలిసిన ఆస్క్ బృందం

**దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లపై వినతి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి సిఫార్సు చేయాలని కోరుతూ (ఆస్క్) బృందం ఢిల్లీలో జస్టిస్ బాలకృష్ణ కమిషన్ చైర్మన్ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఆస్క్ చైర్మన్ లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, కోనసీమ అంబేద్కర్ జిల్లా ఆస్క్ కన్వీనర్ ఇసుకపట్ల ఇమ్మానుయేల్ కుమార్ కలిసి కమిషన్ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ను కలిశారు. ఈ సందర్భంగా దళిత, ఆదివాసీ క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని, దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కుల గణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరినట్లు రాంబాబు తెలిపారు. భారతదేశంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న ప్రత్యక్ష, పరోక్ష వివక్షతలపై ఆస్క్ బృందం సుమారు గంటన్నరపాటు కమిషన్కు వివరించిందన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపకులు వివక్ష కారణంగా విద్యను మధ్యలోనే విడిచిపెట్టడం, ఉద్యోగాలను కోల్పోవడం వంటి సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే జస్టిస్ బాలకృష్ణ కమిషన్ పదవీకాలాన్ని పొడిగించి, దేశవ్యాప్తంగా మరిన్ని వినతులు స్వీకరించే అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. తమ వినతులను కమిషన్ చైర్మన్ సానుకూలంగా విని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని రాంబాబు వెల్లడించారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారు ప్రజలను ఎలా ఆదరించాలో జస్టిస్ బాలకృష్ణన్ ఆదర్శప్రాయమని, ఆయన స్పందన తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని రాంబాబు పేర్కొన్నారు.

## రోడ్ల నాణ్యతలో రాజీపడరాదు : కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్ల నిర్మాణం, నిర్వహణ, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. 50వ డివిజన్ చౌడేశ్వర్ నగర్లో రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు రహదారుల నాణ్యతను పరిశీలించారు. రోడ్డు మందం, కాంక్రీట్ నాణ్యత, ఉపరితలం సమానంగా ఉందా లేదా పరిశీలన చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగర ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించేలా రహదారుల నిర్మాణం ఉండాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా చెక్ చేయాలని సూచించారు. పర్యవేక్షణ చేసే ఇంజనీర్లు కూడా పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ఈ పర్యటనలో డీఈ సత్యనారాయణ, ఇతర ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉన్నారు.

### ఓటరు జాబితా ప్రత్యేక పునర్విమర్శకు

## ప్రజా ప్రతినిధులు సహకరించాలి

**అన్ని పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశం - పలు విషయాలను వెల్లడించిన ఎమ్మార్వో సాయి ప్రసాద్**






**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన ఓటర్లను గుర్తించడమే ఎస్ఐఆర్-2026 ముఖ్య ఉద్దేశమని ఎమ్మార్వో సాయి ప్రసాద్ వివరించారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మార్వో సాయిప్రసాద్ అధ్యక్షతన బూత్ లెవెల్ ఏజెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ రాయవరం మండలంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమానికి ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు జాబితా సమగ్రతను కాపాడటం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారు, నకిలీ మరియు అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా విద్య, ఉపాధి, పట్టణీకరణ కారణంగా ప్రజలు తరచూ వలసలు వెళ్తుండటంతో ఓటరు జాబితాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని, వాడితో కలిసి బిఎల్ఎ లు సహకరించాలని తెలిపారు. బిఎల్ఓ ఉద్యోగి కనుక వారికి పరిపూర్ణ అవగాహన ఉన్నదని, ప్రాంతంపై అవగాహన ఉన్న బిఎల్ఎ లు ఓటర్లను గుర్తించడంలో ప్రముఖ పాత్ర పోషించాలని తెలిపారు. ప్రతి ఓటర్ కి ఎన్యూమరేషన్ ఫారమ్ (ఈఎఫ్) అందజేయబడుతుందని, సర్వే దశలో ఎటువంటి పత్రాలు సేకరించబోరని స్పష్టం చేశారు. ఒకవేళ ఇల్లు మూసి ఉంటే పొరుగువారి ద్వారా వివరాలు సేకరిస్తారని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, కొత్త ఓటర్ల కోసం బీఎల్వోలు ఫారం-6లను అందుబాటులో ఉంచుతారని తెలిపారు. ఆధార్ కార్డును కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణిస్తామని, పౌరసత్వ నిర్ధారణకు అది ఆధారం కాదని స్పష్టం చేశారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్లను స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం పరిశీలన పూర్తిచేసి సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఉపాధి, విద్య తదితర కారణాలతో ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఓటర్ల కోసం ప్రత్యేక హెల్ప్డెస్క్లు, టోల్ఫ్రీ నంబర్ 1950, అలాగే ఈసీఐనెట్ యాప్, వెబ్సైట్ ద్వారా సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

"ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో ఉండాలి... అనర్హులైన వారి పేర్లు జాబితాలో ఉండకూడదు" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రాయవరం మండల ప్రజలు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మార్వో ఎం.వి. సాయి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఏపీకి మరింత ప్రాధాన్యం?


**జనసేన నుంచి లింగంనేని రమేష్, టీడీపీ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డికి అవకాశం?**
**ఢిల్లీ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న ఊహాగానాలు**

**న్యూఢిల్లీ/అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ జరిగితే ఆంధ్రప్రదేశ్కు మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశాలు ఉన్నాయని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల జనసేన పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నికైన లింగంనేని రమేష్ కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే విధంగా, నెల్లూరు లోక్సభ సభ్యుడు, టీడీపీ నేత వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి పేరు కూడా కేంద్ర మంత్రివర్గ విస్తరణ సందర్భంగా పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పార్టీ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, పార్లమెంటులో చురుకైన పాత్ర, రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో ఆయనకు కూడా కేంద్రంలో బాధ్యతలు దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్డీయే కూటమిలో టీడీపీ, జనసేన కీలక భాగస్వాములుగా కొనసాగుతున్న నేపథ్యంలో, రాష్ట్రానికి కేంద్ర మంత్రివర్గంలో మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ప్రాంతీయ సమతుల్యత, మిత్రపక్షాల ప్రాధాన్యత, రాజకీయ సమీకరణాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే కేంద్ర మంత్రివర్గ విస్తరణపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగితేనే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఢిల్లీ రాజకీయ, మీడియా వర్గాల్లో వినిపిస్తున్న ఊహాగానాల ప్రకారం లింగంనేని రమేష్, వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి.

## ప్రత్తిపాడులో నేడు "వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" కార్యక్రమం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని నియోజకవర్గం కేంద్రం ప్రత్తిపాడులో ఎంపీడీవో కార్యాలయంలో 12 తేదీన "వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అర్జీలను స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో జిల్లాలోని ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్నారు. కాగా ప్రత్తిపాడు కార్యక్రమానికి పెద్దాపురం రెవెన్యూ డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 9.30 గంటలకే ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయానికి విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని తెలుపుతూ, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు.





### ఓటర్ల జాబితా సవరణలో

# బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకం

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారుల (బీఎల్వోలు) పాత్ర అత్యంత కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి తెలిపారు. గురువారం జిల్లాస్థాయిలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ప్రతి మండలం నుంచి ఇద్దరు బీఎల్వోలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడమే బీఎల్వో యాప్ శిక్షణ యొక్క ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియను డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా, నూటికి నూరుశాతం ఖచ్చితత్వంతో పూర్తి చేయడానికి బీఎల్వో యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను పూర్తిగా కాగితరహితంగా డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చేయడం, ఒకే ఓటరుకు రెండు చోట్ల ఓటు నమోదు కాకుండా నిరోధించడం, క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు అందుబాటులో ఉంచడం ఈ యాప్ ముఖ్య ఉద్దేశాలని వివరించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించడం, మరణించిన వారు లేదా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను గుర్తించి యాప్‌లో నమోదు

జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి



చేయడం, 18 సంవత్సరాలు పూర్తయిన లేదా 2026 జూలై 1 నాటికి అర్హత పొందే కొత్త ఓటర్లను గుర్తించి సంబంధిత ఫారమ్‌లు పూర్తి చేయడం వంటి బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను బీఎల్వో యాప్ చెక్‌లిస్ట్ ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల జీపీఎస్ కోఆర్డినేట్లు నమోదు చేయడం, తాగునీరు, విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల వివరాలను ఫొటోలతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మూడు అంచెల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదట జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు, అనంతరం నియోజకవర్గాల వారీగా ఈఆర్వోలు, ఏఈఆర్వోల పర్యవేక్షణలో సూపర్‌వైజర్లకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. యాప్ లాగిన్ సమస్యలు, నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో డేటా సేవ్ చేయడం, ఫొటోల నాణ్యతతో అప్‌లోడ్ చేయడం వంటి సాంకేతిక అంశాలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయంగా పనిచేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాప్‌లో డేటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయడం ద్వారా మాత్రమే తుది ఓటర్ల జాబితాను గడువులోగా విడుదల చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని, ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ స్థాయి అధికారులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో పనులను వేగవంతం చేసేందుకు అందుబాటులోకి తీసుకువచ్చిన బీఎల్వో యాప్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యాప్ వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ విధులను సకాలంలో పూర్తి చేసి జిల్లాలో ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.సుబ్బారావు, ఈఆర్వోలు జి.మమ్మీ, జీవీవీ సత్యనారాయణ, ఏ.సరళావతి, తహసీల్దార్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

**కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల క్రైమ్ రివ్యూ సమావేశంలో ఎస్పీ రాహుల్ మీనా**

**కోనసీమ జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో మాసిక క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఉపవిభాగ పోలీసు అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నేరాల నియంత్రణ, పెండింగ్ కేసులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమగ్రంగా సమీక్షించారు. నేరాలు, నేరస్థుల సమాచార అనుసరణ వ్యవస్థ (సీసీటీఎన్ఎస్) డేటా ఆధారంగా జిల్లాలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించిన ఎస్పీ, ముఖ్యంగా మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న గుర్తుతెలియని కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్‌ల వినియోగం, ఒకటి-ఒకటి-రెండు అత్యవసర సేవలు, ఈ-చలానాల వసూళ్లు, వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే ఈ-సాక్ష్య, సీఈఐఆర్ నివేదిక, మెడ్‌లీప్ అనువర్తనాల పనితీరుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే వారం రోజుల్లో నిర్వహించనున్న జాతరలు, పండుగల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కులపరమైన వివాదాలు తలెత్తకుండా సామరస్య కమిటీల ద్వారా శాంతి భద్రతలు కాపాడాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని అధికారులకు సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న వారెంట్లు, అరెస్టులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే 2026 జూలై 11న నిర్వహించనున్న లోక్ అదాలత్‌కు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ రాహుల్ మీనా కోరారు.

### బాధిత కుటుంబానికి

# మంత్రి సుభాష్ ఆర్థిక భరోసా



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధి కోసం వలస వెళ్లి విద్యుత్ ఘాతంతో కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఒక పేద కుటుంబాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించి తన మానవత్వం చాటుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన సిర్రా నారాయుడు, జ్యోతి దంపతులు తమ కుమారుడు గౌతమ్‌తో కలిసి ఉపాధి నిమిత్తం ఎనిమిది నెలల క్రితం ముషీరాబాద్‌కు వెళ్లారు. అక్కడ ఒక అపార్ట్‌మెంట్‌లో వారు వాచ్‌మెన్‌గా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. అయితే నిర్మాణంలో ఉన్న ఒక భవనంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కుమారుడు గౌతమ్ ఆకస్మికంగా మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడిని కోల్పోయి పుట్టెడు శోకంలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వయంగా కుందూరు గ్రామానికి వెళ్లారు. బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం తక్షణ సాయంగా రూ. 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమను ఆదుకుని అండగా నిలిచిన మంత్రి సుభాష్ సేవాగుణానికి, మానవత్వానికి బాధిత కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు కూటమి పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### కుండలేశ్వరం క్షేత్రంలో

# మోడీ పేరున ప్రత్యేక పూజలు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు నేడు భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ వారికి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల ఉండాలని కుండలేశ్వరం క్షేత్రంలో గ్రంధి నానాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానమంత్రిగా సేవలందించిన నాయకుడిగా నరేంద్ర మోదీ కొత్త చరిత్ర సృష్టించారు. ఆయన ప్రధానమంత్రిగా 4,399 రోజులు పూర్తి చేసి, భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ గారి 4,398 రోజుల రికార్డును అధిగమించారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా బిజెపి ప్రముఖ కార్యకర్తలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామంలో పుణ్యక్షేత్రమైన శ్రీ పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారు సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో దేశానికి మరింత సేవ చేయాలని భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారు నాయకత్వంలో దేశం మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రగతి, డిజిటల్ విప్లవం మరియు అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపును సాధించిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధి పట్ల ఆయన అంకితభావం కోట్లాది భారతీయులకు, పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. దేశ ప్రజలు అందిస్తున్న అపారమైన ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు(బాబీ మాస్టర్), జిల్లా బిజెపి కోశాధికారి గ్రంధి సూర్యనారాయణ గుప్త(నానాజీ), జిల్లా కార్యవర్గ సభ్యులు రాయపురెడ్డి భైరవమూర్తి, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గొల్లకోటి వెంకటరెడ్డి, ముమ్మిడివరం టౌన్ బిజెపి అధ్యక్షుడు సన్నిధిరాజు వీరభద్ర శర్మ, ఐ .పోలవరం బిజెపి అధ్యక్షుడు సఖిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పాము కాటుతో స్వీట్స్ స్టాల్ యజమాని మృతి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలో చెముడులంక గ్రామానికి చెందిన స్వీట్ స్టాల్ యజమాని చింత శ్రీనివాసరావు(44) పాముకాటుకు గురై మృతి చెందాడు.రోజూ మాదిరిగానే గురువారం ఉదయం కాలవ పక్కన ఉన్న స్వీట్స్ తయారీ షాపుకు వెళ్లిన శ్రీనివాసరావు పాముకాటుకు గురయ్యారు. అతన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు.కడియం మండలం దుళ్ల నుంచి గత కొన్నేళ్ల క్రితం స్వీట్స్ వ్యాపారానికి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.పెద్ద కుమార్తె పూజిత వివాహం ఆగష్టు15న జరగాల్సి ఉండగా ఇంతలోనే ఇలా కుటుంబ యజమాని మృతి చెందడంతో వారంతా కన్నీరుగా విలపిస్తున్నారు.

### ఘనంగా ముగిసిన

# ‘సత్యం వాసంశెట్టి ఫౌండేషన్’ సమ్మర్ క్యాంప్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో గత 45 రోజులుగా నిర్వహిస్తున్న చిన్నారుల సమ్మర్ క్యాంప్ ఘనంగా ముగిసింది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 250 మంది చిన్నారులకు ఉచితంగా కిక్ బాక్సింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, హ్యాండ్ వర్క్, డ్యాన్స్, చెస్ తదితర విభాగాల్లో ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరై, శిక్షణ పొందిన చిన్నారులతో కొద్దిసేపు ఉత్సాహంగా గడిపారు. క్యాంప్ ముగింపు సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ కళలు, క్రీడా నైపుణ్యాలను చూసి ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో గోదావరిలో ఈతకు వెళ్లి పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు కలచివేస్తున్నాయని అలాగే వారు సెల్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు బానిసలు కాకుండా ఉండేందుకే ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఈ సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన విధంగా ఆదివారాలను “హ్యాపీ సండే”గా మార్చే దిశగా చిన్నారులు అడుగులు వేస్తుండటం ఆనందంగా ఉందని ప్రశంసించారు. పిల్లలు నేర్చుకున్న అంశాలను ప్రతి ఆదివారం ప్రజల ముందుంచేందుకు ప్రత్యేకంగా ఆడిటోరియంలో ప్రదర్శనలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పిల్లల సృజనాత్మకతకు మరింత ప్రోత్సాహం అందించేందుకు వాసంశెట్టి ఫౌండేషన్ భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షకులు, తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

### భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా

# రాయుడు మణికంఠ నియామకం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా ఉపాధ్య క్షుడిగా రామచంద్రాపురానికి చెందిన ప్రముఖ యువ నాయకుడు రాయుడు మణికంఠ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా యువమోర్చా అధ్యక్షుడు గాణాల కల్యాణ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, పార్టీ పెద్దల ఆమోదంతో నాయకత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా రాయుడు మణికంఠ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా పెద్దలకు, నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జిల్లాలో యువతను పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షించేలా, వారి సమస్యల పరిష్కారానికి ఒక వంతెనలా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలను యువతలోకి బలంగా తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మణికంఠ నియామకం పట్ల స్థానిక బిజెపి శ్రేణులు, యువత మరియు వ్యాపార ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రామచంద్రపురంలో 15న మెగా జాబ్ మేళా

### 2 వేల ఉద్యోగాలకు అవకాశం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా రామచంద్రపురం పట్టణంలోని వీఎస్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15వ తేదీన భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సహకారంతో జరగనున్న ఈ మేళాలో టెలిపెర్ఫార్మెన్స్, జెన్‌పాక్ట్, కియా, హెటెరో, ఎల్ అండ్ టీ, ఫాక్స్‌కాన్, అపోలో టైర్స్ వంటి సుమారు 50 ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయి. ఐటీ, నాన్-ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, సేల్స్, మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో దాదాపు 2,000 ఉద్యోగాలను ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ తదితర అర్హతలు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఎవరైనా ఈ మేళాకు హాజరుకావచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, భోజనం, రవాణా, వసతి సదుపాయాలు ఆయా కంపెనీల నిబంధనల ప్రకారం కల్పిస్తారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా ధ్రువపత్రాలతో జూన్ 15 ఉదయం నేరుగా కళాశాలకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 7075704852, 7075904852 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# చదువుకునే రోజులా.. చదువుకొనే రోజులా?

**అడ్డూ అదుపు లేకుండా పోతున్న దోపిడీ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అడ్మిషన్ల సమయంలో అడ్మిషన్ ఫీజులు, ఏవేవో ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారు. యూనిఫామ్, నోట్బుక్స్, టెక్ట్స్ బుక్ పేరుతో ఇష్టానుసారంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల దోపిడీ చేస్తున్నారు. ప్రతి ప్రైవేట్ స్కూల్లో విధిగా ఏయే తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారనేది డిస్ప్లే చేయాలని ప్రభుత్వ నిబంధనలో ఉంది. కానీ.. జిల్లా లోని ఏ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను యాజమాన్యం ప్రదర్శించడంలేదు. జిల్లాలోని కొన్ని పాఠశాలలు తప్పుడు డాక్యుమెంట్స్తో అనుమతులు తీసుకొని నడుపుతున్నాయనే భారీగా ఫిర్యాదులు.. ఏదైనా అనుకోని సందర్భాల్లో పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగితే విద్యార్థులు సేఫ్ తప్పించుకునే అవకాశాలు లేకుండా ఏర్పాటైన స్కూల్స్.. ఒక్క అనుమతితో నాలుగేసి.. ఐదేసి శాఖలను నిర్వహిస్తున్న వైనం...?



# ‘అప్ప ఆరాటమే గాని బావ బ్రతికే యోగం లేదు’

- శంఖవరం 53 కొబ్బరిచెట్ల స్వాధీనంపై తేలని పంచాయతీ
- గ్రామ కంఠం లోనివే... ఆదాయంగా మార్చాలని డిమాండ్
- పంచాయతీకి సంబంధం లేదంటున్న అధికారులు
- ఉన్నత యంత్రాంగం ఉన్నా క్రియాశీలత సున్నా
- ముదిరి పాకాన పడుతోన్న యవ్వారం
- ఆమరణ నిరాహారదీక్షలే శరణ్యమంటోన్న ఫిర్యాదీలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్ప ఆరాటమే గాని బావ బ్రతికే యోగం లేదు ... అన్న సామెతను తలపిస్తోంది కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరం గ్రామకంఠంలోని కొబ్బరి చెట్ల వివాదం. హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంచాలక శాఖకు 1960 వ దశకంలో ధాఖలు పడి నేటికీ ఆ శాఖ యాజమాన్యంలోనే ఉన్న శంఖవరం గ్రామ కంఠం 124 సర్వే నెంబర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాత ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలోని 53 కొబ్బరి చెట్లను పంచాయతీ స్వాధీనం చేసుకుని, వాటికి వేలం పాటలను నిర్వహించి, పంచాయతీకి ఆదాయం రాబట్టాలన్న కొందరు ప్రగతి వాదుల ఆశయం నెరవేరే మార్గం కనపడడం లేదు. ఈ స్థలం పంచాయతీ పరిధిలో లేనే లేదనేది పంచాయతీ వాదన. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో మండల ప్రజా పరిషత్తు అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. శంఖవరం మండలంలో కొంత మంది అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. దీంతో ప్రజా ప్రయోజన సమస్యల పరిష్కార పరిస్థితి “అప్ప ఆరాటమే గాని బావ బ్రతికే యోగం లేదు” అన్న సామెతకు అద్దం పడుతోంది. దీంతో ప్రతీ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్లను ఆశ్రయించే పరిస్థితి దాపురించింది. శంఖవరం 53 కొబ్బరి చెట్ల విషయం కూడా అదే బాట పడుతోంది. కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సార్... మా ఊరి కొబ్బరి చెట్ల గురించి కాస్త పట్టించుకోండి సార్... గ్రామ కంఠం లోని 53 కొబ్బరి చెట్లను స్థానిక పంచాయతీ అధికారులు పట్టించు కోవడం లేదు. చెట్ల కొబ్బరి కాయల ఫలసాయ ఆదాయం కాస్తా ఆయా కాలాల్లో ఆయా రాజకీయ పార్టీల పరిపాలనా హయాంలో నేతల పరం అయిపోతోందని ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరం ప్రజాస్వామ్య ప్రియుల్లో కొందరు మేకల కృష్ణ, పర్వత రామకృష్ణ, బోమ్మిడి సత్యనారాయణ, బొర్రా సత్యనారాయణ, రేలంగి వెంకట సత్యనారాయణ, రేలంగి వెంకటరమణ మీడియా ముఖంగా కోరుతున్నారు. ఈ మేరకు వారు పాత ఆస్పత్రి స్థలంలోని 53 కొబ్బరి చెట్ల తోటలో పాత్రికేయుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. 1989వ సంవత్సరం నుండి శంఖవరం గ్రామ కంఠం సర్వే నెంబర్ 124/5 లోని పాత ఆస్పత్రి కొబ్బరి తోట భూమిలోని 53 చెట్ల కొబ్బరి కాయల ఆదాయం శంఖవరం గ్రామ పంచాయతీకి జమ కావడం లేదని వారు వాపోతున్నారు. ఈ కొబ్బరి తోట ఫల సాయానికి తక్షణం వేలం పాటను నిర్వహించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ బ్యాంక్ పొదుపు ఖాతాకు జమ చేసేందుకు తగు చర్యలను తీసుకోవాల్సిందిగా కోరుతూ జూన్ 1 న పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ ప్రత్యేక అధికారిణి, శంఖవరం ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, శంఖవరం తహశీల్దారుకు స్వయంగా ఫిర్యాదు చేశాం. 11 రోజులు ఐనప్పటికీ గ్రామ పంచాయితీ ఆదాయ వనరుల్లోకి ఆ కొబ్బరి చెట్లను విలీనం చేసుకోలేదు. పైగా అవి పంచాయతీకి సంబంధించినవి కాదని కార్యదర్శి అప్పలరాజు మౌఖికంగా చెబుతున్నారని వారు పేర్కొన్నారు. 1954 సంవత్సరం నుండి 124/5 సర్వేనెంబర్ నందు ఆస్తి శంఖవరం గ్రామ పంచాయతీకి చెందిందని తెలుపుతున్న 1954 పెయిర్ అడంగల్, 22 ఎ(1) రిజిస్టర్లు, ఆర్ఓఆర్ 1బి, ఎఫ్ఎంబి కాపీలను కూడా వారు బహిర్గతం చేసారు. 20-01-2022వ తేదీన ఇదే సర్వే నెంబర్ కొబ్బరి తోటలో రైతులు పంటలను నిల్వ చేసుకొనే షెడ్ నిర్మాణానికి ఉద్యానవన శాఖకు పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని కూడా బయటకు తీసి, గ్రామ కంఠం కొబ్బరి తోట పంచాయతీ ఆస్థేనని రూఢీ పరిచే ప్రయత్నం చేశారు. సామాజిక సేవా కార్యకర్త, సమాచారహక్కు చట్టం ప్రచార కార్యకర్త మేకల కృష్ణ మాట్లాడుతూ... కొంత మంది పెత్తందారులు ఈ కొబ్బరి చెట్ల ఆదాయాన్ని దోచుకునేందుకు అధికారులు కావాలనే పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.

# శంఖవరం తహసిల్దారుగా సూరిబాబు నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొత్త తాహసిల్దారుగా మొసలి సూరిబాబు నియమితులు అయ్యారు. నియమితులైన ఆరు రోజులు తర్వాత గురువారం జ్యేష్ట మాస కృష్ణ పక్ష ఏకాదశి తిథి మంచి రోజు కావడంతో ఈయన ఇక్కడ విధుల్లో చేరారు. కాకినాడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని తాళ్ళరేవు మండలం ఉప తాహసిల్దారుగా విధులను నిర్వహిస్తూండగా తాహసిల్దారుగా ఉద్యోగోన్నతి పొంది శంఖవరం మండలానికి తాహసిల్ధారుగా బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ఈయన ఇదే రెవిన్యూ శాఖలో వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో విధులను నిర్వర్తించారు. ఈయన తొలుత శంఖవరం తాహసిల్ధార్ కార్యాలయంలో 1999-2003 లో టైపిస్టుగా ఐదేళ్ళపాటూ సంతృప్తి కరంగా తన సేవలను అందించారు. తన విధులను సక్రమంగా నిర్వర్తించి మన్ననలను పొందారు. 2003-2006 లో కాకినాడ కలెక్టరేట్లో డి సెక్షన్ సూపరింటెండెంటుగా విధులను నిర్వహించారు. 2006-2008 లో మండపేట మండలం రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేసారు. 2008-2016 కాకినాడ కలెక్టర్ సిసిగా పనిచేసారు. 2016-2022 లో ఆగష్టు నెల వరకూ కాకినాడ, కాకినాడ పట్టణ ప్రాంతాల్లో ఎంఎస్ఓ గా విధులను చేపట్టారు. ఇందులో పట్టణ ఎంఎస్ఓగా మూడున్నర ఏళ్ళు సేవలను అందించారు. 2022-2026 జూన్ 5 వరకూ తాళ్ళరేవు మండలం డిప్యూటీ తాహసిల్దారుగా విధులను నిర్వహించి తాహసిల్దారుగా ఉద్యోగోన్నతి పొందారు. నేడు విధుల్లో చేరారు. ఈయనకు మండలంలోని రెవెన్యూ సిబ్బంది అందరూ ఘన స్వాగతం పలికారు. మెడలో పూలమాలలు వేసి ఆయన్ని అభినందించారు. ఈయన ఈ రోజు చాలా మంచిదనే భావనతో మండలంని అచ్చంపేట పంచాయతీని సాయంత్రం నాలుగు గంటలకు నూతన తాహసిల్దార్ సూరిబాబు సందర్శించారు. ఇక్కడ జరిగిన ప్రభుత్వ సభా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా నేటి వరకూ శంఖవరం మండల తాహసిల్దారుగా విధులను నిర్వర్తించిన అల్లాడి తాతారావు కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనా అధికారిగా బదిలీ అయ్యారు.

## పాఠశాలల పునఃప్రారంభంపై ఎమ్మెల్యే సత్యప్రభ సమీక్ష

### నాలుగు మండలాల ఎంఈఓలకు కీలక ఆదేశాలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలకు వేసవి సెలవులు ముగిసి, బడుల పునఃప్రారంభానికి సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో పాఠశాలల అభివృద్ధిపై కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి నాలుగు మండలాల ఎంఈఓలతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశించారు. పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం, టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మౌలిక వసతులు, సదుపాయాలు సమర్థవంతంగా ఉండేలా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, శుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సూరిశెట్టి వెంకట రమణ, వి.రాజబాబు, ఎం.అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## నెరవేర్చలేని హామీలతో మోసం చేసిన కూటమి పార్టీలు : పెదిరెడ్ల సురేష్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** “చంద్రబాబు వెన్ను పోటుకు రెండేళ్లు” కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రెటరీ, తొండంగి మాజీ సర్పంచ్ పెదిరెడ్ల సురేష్ పిలుపును ఇచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు తుని రాజా గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ మెయిన్ రోడ్ మీదుగా ఎమ్మార్వో కార్యాలయం వరకు కొనసాగనుంది అన్నారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు విభాగ ప్రతినిధులు పాల్గొన నున్నారని తెలిపారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. అమలు చేయలేని హామీలతో ప్రజలను మోసం చేసి, వెన్నుపోటు పొడిచాయని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే విధంగా కూటమి పార్టీల ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను విస్మరించి రైతులు, కూలీలు, సామాన్య ప్రజలపై పన్నులు, అప్పులు భారాలు మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెదిరెడ్ల సురేష్ పిలుపును ఇచ్చారు.

### శంఖవరం ఏపీ మోడల్ స్కూల్లోకి

## ప్రవేశ ఆహ్వానం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల శంఖవరంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లోకి విద్యార్థుల ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎ.వీరరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి శంఖవరం ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లో మిగిలి ఉన్న 7, 8,9 తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం అన్నారు. ఈ నెల 10 నుంచి 20 తారీఖు వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామని, అభ్యర్థించే విద్యార్థులు తప్పనిసరిగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. 7,8, 9వ తరగతుల వరకు విద్యార్థుల ప్రవేశాల కోసం 24న ప్రవేశ అర్హతా పరీక్షను నిర్వహించి, ఎంపికైన అర్హులు పేర్ల జాబితాను 25 న ప్రకటిస్తామని, 26 న ప్రవేశ అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. మిగిలిన ఖాళీలను స్థానిక, స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 4 టిప్పర్లకు జరిమానా విధించిన జిల్లా కలెక్టర్

### ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కారణం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలంలో క్షేత్ర పర్యటన జరుపుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్‌కు మైనింగ్, క్వారీయింగ్ కార్యకలాపాల్లో వినియోగిస్తున్న 4 టిప్పర్లు అతివేగంగా రాష్ డ్రైవింగ్ తో ఆయన వాహనానికి ఎదురుపడ్డాయి. ఈ వాహనాల్లోని లోడ్ కు ఎటువంటి కవర్లు కప్పకుండా, ప్రజల భద్రతను ఏ మాత్రం పట్టించుకోకుండా జనావాసాల్లో తిరుగుతున్న ఈ నాలుగు వాహనాలను ఆపి భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిబంధనలు అతిక్రమించి మితి మీరిన వేగంతో ప్రమాదకరంగా సంచరిస్తున్న ఈ నాలుగు వాహనాలకూ ఒక్కక్కదానికీ రూ. 4 వేలు చొప్పున జిల్లా కలెక్టర్ జరిమానా విధించారు. జరిమానా చెల్లించే వరకు ఈ వాహనాలను విడుదల చేయొద్దని శంఖవరం తహశీల్దారు మొసలి సూరిబాబును ఆదేశించారు. అలాగే వాహనాల్లోని లోడ్ కు సరైన కవర్లు కప్పకుండా, ఓవర్ లోడింగ్‌తో అతివేగంగా జనావాసాల్లో ప్రమాదకరంగా రాష్ డ్రైవింగ్‌తో నడుపుతున్న మైనింగ్, క్వారియింగ్ వాహనాలపై రౌతులపూడి, శంఖవరం మండలాల ప్రజల నుండి పలు పిర్యాదులు అందాయని, ఇటువంటి వాహనాలపై నిశితమైన నిఘా ఉంచి నియంత్రించాలని, నిబంధనలను ఆతిక్రమించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా, గనులు, భూగర్భశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో నిర్లిప్తంగా వ్యవహరించిన అధికారులపై సిసిఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలను తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రత్తిపాడు రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని నియోజకవర్గం కేంద్రం ప్రత్తిపాడులో స్థానిక సంతోషిమాత ఆలయం సమీపంలో గురువారం ఓ విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఒక మహిళ శిరస్సు నుజ్జునుజ్జు అయ్యి అక్కడి కక్కడే మరణించింది. జిల్లాలోని కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన బొడ్డు పద్మావతి (51) తన భర్తతో కలిసి చిన్న ఏలూరు ప్రాంతంలో పొలం పనులు చూసుకుని ద్విచక్ర వాహనంపై ప్రత్తిపాడుకు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా దొడ్ల డెయిరీకి చెందిన పాల ట్యాంకర్ వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి మహిళ కింద పడిపోయింది. అలా పడిన క్షణాల్లోనే ఆమె శిరస్సుపై నుంచి అదే ట్యాంకర్ తొక్కుకుంటూ ముందుకు వెళ్లింది. దీంతో ఆమె శిరస్సుపై నుజ్జు నుజ్జుగా మారి అక్కడికక్కడే మరణించింది. భర్త తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటన సమాచారం అందుకున్న ప్రత్తిపాడు పోలీసు ఎస్.ఐ. లక్ష్మీకాంతం, ఆమె సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నడకుదురు గ్రామంలో బాధితులక కుటుంబీకులు, బంధువుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బాధితులకు చంద్రన్న బీమా అందించిన ఎమ్మెల్యే



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేవలం రూ.100 ప్రీమియంతో తీసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చంద్రన్న భీమా పథకం బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు బోడపాటి చంటి సోదరుడు త్రిమూర్తులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి చంద్రన్న భీమా పథకం ద్వారా మంజూరైన రూ. 5 లక్షల నష్టపరిహార బీమా చెక్కును ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం అందజేశారు. అలాగే మచ్చా నాగుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకంలో మంజూరైన చెక్కును కూడా ఎమ్మెల్యే సత్యప్రభ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం రూ.100తో తీసుకున్న చంద్రన్న భీమా నేడు ఆ కుటుంబానికి పెద్ద అండగా నిలిచిందని, ఇలాంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె సూచించారు. చంద్రన్న బీమా పథకం లబ్ది రూ.5 లక్షల సాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, మాజీ ఎంపీటీసీ సభ్యులు సాధనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, కొయ్యా రమణ తదితరులు పాల్గొన్నారు.

## వీరూ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత కత్తిపూడి జట్టు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్వర్గీయ వెలుగుల వీరేంద్ర జ్ఞాపకార్థం కత్తిపూడి క్రికెట్ ప్లేయర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరూ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం విజయ వంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 30 జట్ల క్రీడాకారులు పాల్గొన్నాయి. ఆఖరి ఆటలో కత్తిపూడి జట్టు తాటిపర్తి జట్టుతో తలపడింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో కత్తిపూడి జట్టు విజేతగా నిలవగానూ, తాటిపర్తి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్య భావనను, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.శయువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ ఛైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, కత్తిపూడి సొసైటీ ఛైర్మన్ గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసిలు సాధనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, కత్తిపూడి టౌన్ టీడీపీ అధ్యక్షులు కేళంగి జనార్ధన్, కత్తిపూడి యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శుక్రవారం, 12 జూన్ 2026
www.viswamvoice.com



### మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో

# ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు శ్రీకారం

## 100 కోట్లతో అత్యాధునిక పైలట్ శిక్షణ కేంద్రానికి ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతకు ప్రపంచ స్థాయి విమాన యాన శిక్షణతో ఉపాధి అవకాశాలు విరివిగా ఏర్పడినట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. గురువారం మధురపూడిలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో 100 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ) ఏర్పాటుకు ఆమె శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌గా ఇది నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ దేశ విమానయాన రంగ అభివృద్ధిలో ఇది ఒక కీలక ముందడు గన్నారు. సుమారు ఆరు నెలల్లో ఈ శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావా లని లక్ష్యంగా పెట్టుకున్నామని, తొలి దశలో సుమారు 30మంది శిక్షణ అందించ నున్నట్లు తెలిపారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా,గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటి సంఖ్యను 166కు పెంచిందన్నారు. ఉడాన్ పథకం ద్వారా విమాన ప్రయాణాన్ని సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గతంలో దేశంలో ఆరు విమానయాన సంస్థలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య తొమ్మిదికి చేరిందన్నారు. విమానాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన పైలట్ల అవసరం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ పైలట్ ట్రైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా దశల వారీగా సుమారు 500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన శిక్షణ రంగానికి ఇది కొత్త దిశానిర్దేశం చేస్తుందని,రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు వస్తాయ న్నారు. దేశంలో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం డీజీసీఏ అనుమతితో దేశవ్యాప్తంగా 35 ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు మాత్రమే పనిచేస్తుండగా, అవి సంవత్సరానికి సుమారు 1,100 మంది పైలట్లకు మాత్రమే శిక్షణ అందిస్తు న్నాయనన్నారు. దేశీయ విమానయాన సంస్థలు వేలాది కొత్త విమానాలను కొనుగోలు చేస్తున్న తరుణంలో రానున్న సంవత్సరాల్లో 25 వేల నుంచి 30 వేల మంది కొత్త పైలట్ల అవసరం ఉందని, ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌ను మధురపూడిలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణ మన్నారు. జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో 100 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక శిక్షణా మౌలిక వసతులు, డైమండ్ డీఏ-40, డీఏ-42 శిక్షణ విమానాలతో కూడిన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది కనీసం 100 మంది పైలట్లను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేయ నుందన్నారు. సెప్టెంబర్ తొలి వారంలో శిక్షణ విమానాలు చేరుకున్న అనంతరం డీజీసీఏ అనుమతులు పూర్తిచేసుకుని పూర్తి స్థాయి శిక్షణ కార్యకలాపాలు ప్రారంభి స్తుందన్నారు. జార్విస్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ ఫణీంద్ర మాట్లాడుతూ రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయం ఫ్లైట్ ట్రైనింగ్‌కు అత్యంత అనువైన ప్రదేశమని తెలిపారు. విమాన యాన రంగ నిపుణులు, పరిశ్రమకు చెందిన ప్రముఖుల ఆధ్వర్యంలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ స్థాపించ బడిందన్నారు. దేశంలో ప్రస్తుతం శిక్షణ పొందిన పైలట్ల కొరత తీవ్రంగా ఉందని, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలుసుమారు 2,000 కొత్త విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని పేర్కొన్నారు. పరిశ్రమ అంచనాల ప్రకారం రానున్న దశాబ్దంలో 25వేల నుంచి 30వేల మంది కొత్త పైలట్ల అవసరం ఏర్పడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జార్విస్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ ఫణీంద్ర,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి,ఆదిరెడ్డి వాసు,బత్తుల బల రామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నామాన రాంబాబు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కె. ప్రీత, నామాన శ్రీనివాస్, ఏపీ ఆర్ చౌదరి, మద్దిపాటి రజిని, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్, బదిరెడ్డి దొర, యర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, పలువురు ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ విగ్రహ ప్రతిష్టకు

# ఎంపీ పురంధేశ్వరిని ఆహ్వానించిన చెల్లుబోయిన మూర్తి, పెద్దలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 14వ వార్డు శారద నగర్ జీవన్ బట్టల షాప్ ఎదురుగా గల శ్రీఉమామహేశ్వర దేవాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కొరకు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆమె స్వగృహంలో ప్రతిష్ట ఆహ్వాన పత్రాన్ని అందించి ఆహ్వానించటం జరిగింది అని ప్రముఖ తెలుగుదేశం పార్టీ నగర నాయకులు, అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కమిటీ చైర్మన్ చెల్లు బోయిన సూర్యనారాయణ మూర్తి ,14వ వార్డు ఇంచార్జి ఈతలపాటి రవికుమార్, బీజేపీ నాయకులు ఎస్సీ సెల్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్, ఆలయ అధ్యక్షుడు భోగి వీర్రాజు, బొండపల్లి బాబ్జి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### పిఎంపిలు సామాజిక ప్రభుత్వ

# ఆరోగ్య కార్యక్రమాల్లో సేవలు అందించాలి

### నిడదవోలు పీఎంపీల నూతన కమిటీ ఏర్పాటు



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక సేవలో పీఎంపీలు ముందుం డాలని పీఎంపీ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అన్నారు. గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నికలు జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక హెటల్ ఆనంద్ ఇన్ కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలో నిడదవోలు పీఎంపీలు చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందిస్తూ ఈ ఏడాది కూడా సామాజిక కార్యక్రమాలు,ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో పాల్గొని సేవలందించాలని సూచించారు. ముందుగా శ్రీనివాస హెర్బల్ ఫార్మా వారిచే నేటి జీవనయానంలో ఆయుర్వేదం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికలలో పోతుల సత్య వరప్రసాద్ మండల నూతన కమిటీ అధ్యక్షులుగాను,పీవీవీ సత్యనారాయణ మండల నూతన కమిటీ కార్యదర్శిగా, నైదాని పండు నూతన కమిటీ కోశాధికారి ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగింది. నూతన కమిటీలో గౌరవ సలహాదారులుగా పీ.దానశంకరం, ఉపాధ్యక్షులుగా ఎమ్వీఎస్ సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా బీఎన్ కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా తోరం వీర వెంకటరావు, కేశనకుర్తి వీరబాబు, ఎస్.రవిప్రసాద్, ఎమ్డీ సత్యనారాయణ, మల్లిపూడి సూరిబాబు, పీఎస్ రవికుమార్ లను ఎన్నుకోవడమైనది. ఈ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస హెర్బల్ ఫార్మా మేనేజింగ్ పార్టనర్ అంకం శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో ప్రజా ఆరోగ్యానికి హానికరమైన మిశ్రమాలు

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించం - పదార్థాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం - ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార తనిఖీలు**

**ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు - ఫుడ్ సేఫ్టీ అధికారి కె.సుప్రియ**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన ఫుడ్ సేఫ్టీ శాఖ, రాజమహేంద్రవరం పట్టణంలోని పలు జ్యూస్, రోజ్‌మిల్క్, టీ దుకాణాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది అని ఫుడ్ సేఫ్టీ అధికారి కే.సుప్రియ స్పష్టం చేశారు. మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ సంయుక్తంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో విక్రయిస్తున్న ఆహార, పానీయాల నాణ్యత, తయారీ విధానాలు, నిల్వ పరిస్థితులు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ కె.సుప్రియ వివరాలు తెలియచేస్తూ, తనిఖీల సందర్భంగా కొన్ని దుకాణాల్లో వినియోగిస్తున్న పదార్థాలు, మిశ్రమాలు ప్రజారోగ్యానికి హానికరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్రూట్ జ్యూస్‌లు, రోజ్‌మిల్క్ తయారీలో ఉపయోగిస్తున్న కొన్ని పదార్థాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం కావడంతో నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షల కోసం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రియ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆహార వ్యాపారులు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారులకు సురక్షితమైన ఆహార, పానీయాలను మాత్రమే అందించాలని సూచించారు. ప్రజలు కూడా అనుమానాస్పద ఆహార పదార్థాలు లేదా పానీయాలు విక్రయిస్తున్నట్లు గమనిస్తే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని సుప్రియ కోరారు. ఈ దిగువ ఫోన్ నెంబర్ 08645-2410295 కు నేరుగా ఫిర్యాదు చెయ్యవచ్చు అని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# చెస్ టోర్నమెంట్‌లో కాల్ ఫ్యూజన్

### అకాడమీ విద్యార్థుల ప్రతిభ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ fide(ఫీడె) రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి రేటింగ్ సొంతం చేసుకున్నారు. వీరిలో డి.సూర్యతేజ 15 74, కే.హేమచంద్ 14 88, డి.సాయి సంవిధ 14 87,వి.లతిక 14 78,పి.అవినాష్ 14 66,డి.కేతన్ సాయి శ్రేయాన్స్ 14 10,జీ.లక్ష్మీ చైతన్య 14 04 తో పాటు కె. వేద శ్రీ ,విత్తనాల షణ్ముఖ సాయి ఇటీవల అమరావతి లో జరిగిన చెస్ అంతర్జాతీయ టోర్నమెంట్లో నగదు బహుమతి అలాగే ఎనిమిది, మూడో స్థానంలో నిలిచారని కాల్ ఫ్యూజన్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ పేర్కొన్నారు.అదేవిధంగా ఈ వేసవిలో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించామని జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లో పాల్గొనే విధంగా శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో రేటింగ్ సాధించిన క్రీడాకారులను వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు లక్ష్మీ హైమావతి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణతోనే మలేరియా నియంత్రణ సాధ్యం : పీడీడీ బిషప్

### ఉన్నత అధికారుల ఆదేశాలతో అవగాహన కార్యక్రమాలు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ మలేరియా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం చెల్లూరు గ్రామంలో మలేరియా నివారణ, వడగాల్పుల నుంచి రక్షణ చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మణికంఠ సూచనలు, సలహాల మేరకు మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ పీడీడీ బిషప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించిన పీడీడీ బిషప్, మలేరియా వ్యాధి అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాపిస్తుందని వివరించారు. దోమల నివాస ప్రాంతాలను నిర్మూలించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇంటి బయట ఉన్న రుబ్బురోలు, ప్లాస్టిక్ తొట్టెలు, పాత టైర్లు వంటి వాటిలో నిల్వ నీటిని వారానికి ఒకసారి శుభ్రం చేయాలని సూచించారు. ఇళ్లలో దోమతెరలు ఉపయోగించడంతో పాటు కిటికీలకు మెష్ డోర్లు ఏర్పాటు చేసుకోవాలని, రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వడగాల్పుల నుంచి రక్షణ పొందే మార్గాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల ప్రాముఖ్యత గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు టి. ఇమ్మానుయేల్, ఐ.వీరన్న, ఏఎన్ఎం కె.అనంతలక్ష్మి, ఆశా వర్కర్లు సరోజ, లలిత, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బి.భాస్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా డీఎంహెచ్ఓ, డీఎంఓ ఆదేశాల మేరకు మలేరియా మాసోత్సవాల కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల్లో వ్యాధుల నివారణపై అవగాహన పెంపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# బొడ్డు చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ చెక్కులు పంపిణీ

### ఎన్డీఏ నాయకులు కృతజ్ఞతలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. గురువారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజానగరం మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన చేతుల మీద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను చక్కగా అమలు చేస్తూ, ఆంధ్రుల రాజధాని అమరావతి, అదేవిధంగా ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టులను శరవేగంగా తీర్చిదిదుతుందన్నారు. రాష్ట్ర ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా రాష్ట్రంలో పలు కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకుంటూ రాష్ట్రాన్ని పెట్టుబడిల హబ్ గా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ గత ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనారోగ్యంగా ఉన్నవారికి కొట్లాది రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఆరోగ్యశ్రీ చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బొడ్డులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబు రాయుడు, కొల్లం రత్నం, కొణతం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం ట్రస్ట్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్-సత్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు వై.వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని దివ్యాంగుడు ఎస్.దుర్గాప్రసాద్‌కు ట్రైసైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా వై.వెంకటేష్ మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోసి కుమార్, సత్య దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.వి.ఆర్. సాగర్, సింగారెడ్డి, ముచ్చు రాజశేఖర్, కొండేపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# చేతి నిండా టీవీ షోస్, ఈవెంట్స్..

## జబర్దస్త్ వర్ష నెలకు ఎంత సంపాదిస్తుందో తెలుసా?



జబర్దస్త్ కామెడీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో వర్ష ఒకరు. అంతకు ముందు పలు సీరియల్స్ లో నటించిన ఆమె తన అందం, అభినయంతో బుల్లితెర ఆడియెన్స్ కు బాగా దగ్గరయ్యింది. ఇక జబర్దస్త్ లో ఇమ్మాన్యుయేల్‌తో కలిసి వర్ష చేసిన స్కిట్స్ ఆడియెన్స్ ను కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ద్వారా బాగా పాపులర్ అయిన వారిలో వర్ష కూడా ఒకరు. ఈ కామెడీ షోలో ఇమ్మాన్యుయేల్ తో ఆమె చేసిన కామెడీ స్కిట్స్, లవ్ ట్రాక్ లు బుల్లితెర ఆడియెన్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. కాగా జబర్దస్త్ కంటే ముందు పలు సీరియల్స్ లో యాక్ట్ చేసింది వర్షం. తన గ్లామర్ అండ్ యాక్టింగ్ తో బుల్లితెరపై బాగానే ఫేమస్ అయ్యింది. ఇక జబర్దస్త్ కు వచ్చిన తర్వాత వర్ష రేంజ్, క్రేజ్ అమాంతం పెరిగిపోయాయి. పలు టీవీ షోస్, ప్రోగ్రామ్స్ లో ఈ అమ్మడికి అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ టీవీ షోలతో పాటు హోస్ట్ గానూ రాణిస్తోంది వర్ష. ఓ ప్రముఖ ఛానెల్ లో సెలబ్రిటీ లతో కలిసి టాక్ షో రన్ చేస్తోంది. వీటితో పాటు బయట ఈవెంట్స్, ప్రోగ్రామ్స్ కూడా చేస్తుంటుందీ ముద్దుగుమ్మ. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామరస్ ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తుంటుంది. మరి చేతినిండా టీవీ షోస్, ప్రోగ్రామ్స్ తో బిజీగా ఉంటోన్న వర్ష నెలకు ఎంత సంపాదిస్తుందో తెలుసా? అని నెటిజన్లు గూగుల్‌లో తెగ సెర్చ్ చేస్తున్నారు. కాగా కెరీర్ ప్రారంభంలో తొలి ప్రేమ, ప్రేమ ఎంత మధురం, మట్టి గాజులు, అత్తారింటికి దారేది వంటి ఫేమస్ సీరియల్స్ లో నటించింది వర్ష. ఆ తర్వాత జబర్దస్త్ లోకి అడుగు పెట్టింది. ఇప్పుడు పలు టీవీ షోల్లో సందడి చేయడంతో పాటు యాంకరింగ్ కూడా చేస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని నివేదికల ప్రకారం వర్ష నెలకు దాదాపు పది లక్షలకు పైగా సంపాదిస్తుందని తెలుస్తోంది. అయితే ఇందులో ఎంత నిజముందో అబద్ధముందో తెలియాదు కానీ వర్ష రెమ్యునరేషన్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో బాగా హాట్ టాపిక్ గా మారింది. కాగా మంచి పాత్రలు వస్తే సినిమాల్లో నూ నటిస్తానంటోంది వర్ష. ఆ మధ్యన ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసిందీ అందాల తార. అలాగనీ హీరోయిన్ పాత్రలు చేయాలన్న ఆశ లేదని, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగ చైతన్య సినిమాల్లో పాత్రలు వస్తే కచ్చితంగా చేస్తానని వర్ష చెప్పుకొచ్చింది.

### 3 రోజులకే ఆ సినిమా నుంచి తప్పుకోవాలనుకున్నాను..

# వెంటనే డైరెక్టర్‌కు మెసేజ్ పెట్టాను.. : సాయి పల్లవి



న్యాచురల్ బ్యూటీ సాయి పల్లవి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేసింది. ప్రస్తుతం హిందీలో బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. చివరగా.. అమరన్, తండేల్ వంటి చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు.. ప్రస్తుతం ధనుష్ సరసన మరో సినిమా చేస్తుంది. ఈ క్రమంలోనే గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. దక్షిణాది చిత్రసీమలో కథానాయికగా అనేక విజయవంతమైన చిత్రాలను అందించి, ఇప్పుడు బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్న హీరోయిన్ సాయి పల్లవి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సూర్య నటించిన 'NGK' చిత్రం నుండి మూడవ రోజే తప్పుకోవాలనుకున్నానని వెల్లడించారు. 'ప్రేమమ్' చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టిన సాయి పల్లవి, తమిళం, తెలుగులో కూడా అభిమానులను సంపాదించుకుంది. ఎల్. విజయ్ దర్శకత్వం వహించిన 'దియా' చిత్రంతో తమిళ చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తక్కువ సమయంలోనే ధనుష్, సూర్య వంటి అగ్ర నటులతో విజయవంతమైన చిత్రాలను అందించింది. ఆమె చివరిగా తమిళంలో 'అమరన్' చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ధనుష్ హీరోగా నటిస్తున్న చిత్రంలో నటిస్తోంది. తెలుగులో కూడా అనేక విజయవంతమైన చిత్రాలను అందించిన సాయి పల్లవి, నాని, నాగ చైతన్య నటులతో జంటగా నటించి విజయం సాధించారు. ప్రస్తుతం భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణం'లో నటిస్తున్న సాయి పల్లవి, మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి సరసన నటించనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు తన సినిమాల్లో ఎలాంటి గ్లామర్ చూపించకుండా గృహిణిలాంటి లుక్‌లో నటిస్తున్న సాయి పల్లవికి భారీ అభిమాన గణం ఉంది. అదేవిధంగా, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సాయి పల్లవి, ఎప్పటికప్పుడు ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు గ్లామరస్‌గా కాకుండా, చాలావరకు గృహిణిలా కనిపిస్తాయి. ఒక ఇంటర్వ్యూలో సాయి పల్లవి సూర్య 'NGK' చిత్రం గురించి మాట్లాడుతూ, "ఈ సినిమా షూటింగ్ సమయంలో మూడవ రోజే నేను తప్పుకోవాలని అనుకున్నాను. దర్శకుడు ఒక్క షాట్‌కు కూడా ఓకే చెప్పేవారు కాదు. నేను మొత్తం సమయం షూటింగ్ చేసేదాన్ని. కానీ ఆయన షాట్‌కు ఓకే చెప్పకుండానే బ్యాకప్ అనేవారు. ఇది మాకు వర్కౌట్ అవ్వదని, మా నటన ఆయనకు నచ్చలేదని నేను భావించాను. అందుకే సినిమా నుండి తప్పుకుంటున్నట్లు దర్శకుడు సెల్వరాఘవన్‌కు మెసేజ్ పంపాను. ఆ సమయంలో 'మారి 2' విడుదలైనప్పుడు, ధనుష్ ఏమైనా అన్నాడో లేదో నాకు తెలియదు." మరుసటి రోజు నేను షూటింగ్‌కు వెళ్ళినప్పుడు, మొదటి షాట్‌లోనే అన్ని సన్నివేశాలు బాగా వచ్చాయని ఆయన చెప్పారు. ధనుష్ సర్ ఇది ఉచితంగా చేస్తారని, మీరు ఏమీ గమనించరని నాతో చెప్పారని సాయి పల్లవి చెప్పింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి.

### ముక్కోణపు సిరీస్..

# భారత్-ఎపై అఫ్గాన్-ఎ విజయం



ముక్కోణపు సిరీస్‌లో భాగంగా భారత్-ఎతో జరిగిన వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్-ఎ జట్టు గెలి చింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ నిర్ణీత 49 ఓవర్లలో(వర్షం కార ణంగా కుదింపు) 349/9 పరుగులు చేసింది. వర్షం కారణంగా అఫ్గాన్-ఎ ఇన్నింగ్స్‌ను 38 ఓవర్లకు కుదించి.. టార్గెట్‌ను 294గా నిర్ణయించారు. ఛేదనలో అఫ్గాన్-ఎ 25.5 ఓవర్లకు 177/2 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడంతో డీఎల్ఎస్ విధానం ప్రకారం 4 పరుగుల తేడాతో అఫ్గాన్-ఎ విజయం సాధించింది. ఇమ్రాన్ 75లి, బహీర్ షా 51లి, హసన్ 34 రన్స్ చేశారు. భారత-ఎ బౌలర్లలో అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్ చెరో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ప్రభ్ సిమ్రన్ సింగ్ (84), రుతురాజ్ గైక్వాడ్ (66), తిలక్ వర్మ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. వైభవ్ సూర్యవంశీ 44 రన్స్ చేశాడు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్లా 5, సాఫి 3, ఇమ్రాన్ ఒక వికెట్ తీశారు.

# ఆ జట్టుదే ఫిఫా వరల్డ్ కప్..

## మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్ ఏం చెప్పిందంటే?

ఫుట్‌బాల్ సంబరం మొదలు కానుంది. ఇవాళ అర్ధరాత్రి నుంచి ఫిఫా వరల్డ్ కప్ షురూ కానుంది. ఫిఫా ప్రపంచ కప్‌నకు అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. వేడుకల్లో హాలీవుడ్ తారలు సందడి చేయనున్నారు. బాలీవుడ్ నటి నోరా ఫతేహీ కూడా అలరించనుంది. ఈ క్రమంలో 48 దేశాలు పోటీ పడే ఈ వరల్డ్ కప్‌లో ఎవరు విజేతగా నిలుస్తారనేది ఆసక్తికకరంగా మారింది. ఒకప్పుడు ఫుట్‌బాల్ ప్రపంచ కప్ విజేత ఎవరో అంచనా వేయడానికి 'ఆక్టోపస్'ని ఉపయోగించిన సంగతి తెలిసిందే. మరి ఇప్పుడు మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హయాంలో ఉన్నాం.. యూనివర్సిటీ ఆఫ్ ఇన్స్‌బర్క్ ప్రొఫెసర్ అచీమ్ జెలీస్ ఓ అల్గారిథమ్‌ను రెడీ చేసి ఆ ఫలితాన్ని వెల్లడించారు. తన అల్గారిథమ్ రెండు దశల్లో పనిచేస్తుందని ప్రొఫెసర్ అచీమ్ తెలిపారు. "మొదటి స్టెప్‌లో.. అన్ని టీమ్‌లు, ఆటగాళ్ల బలాలను అంచనా వేయడానికి, అధునాతన గణాంక నమూనాలు, బుక్ మేకర్లు, నిపుణుల అభిప్రాయాలను నమోదు చేయడం జరిగింది. ఇక రెండో దశలో.. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్ ఆయా జట్లలో ఏది బెస్ట్ అనేది తెలుస్తుంది. అందుకోసం మేం ఇచ్చిన వివరాలన్నింటినీ క్రోడీకరించి విశ్లేషిస్తుంది. అందుకోసం మేం దాదాపు లక్షకుపైగా







సిమ్యులేషన్లను నిర్వహించాం. ఇందులో స్పెయిన్ 14.5 శాతంతో విజేతగా అవతరిస్తుందని వచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ (12.4 శాతం), ఫ్రాన్స్ (12.4 శాతం), జర్మనీ (11.2 శాతం), పోర్చుగల్ (8.9 శాతం), అర్జెంటీనా (8.2 శాతం)కు అవకాశాలు ఉన్నాయి" అని అచీమ్ విశ్లేషించారు. పోర్చుగల్ జట్టులో క్రిస్టియానో రొనాల్డో, అర్జెంటీనా టీమ్‌లో లియోనాల్ మెస్సి ఉన్న సంగతి తెలిసిందే.

**ఈ నాలుగింటిని పరిగణనలోకి తీసుకొని..**

ప్రపంచ కప్ బరిలోకి దిగిన అన్ని జట్ల గత ఎనిమిదేళ్ల గణాంకాలను అందించాం. ఆటగాళ్ల బలాలు, బలహీనతలతోపాటు జట్టు సాధించిన విజయాలను పొందుపరిచాం.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న బుక్ మేకర్లు, నిపుణుల అభిప్రాయాలను అల్గారిథమ్‌కు ఇచ్చాం. గత టోర్నీల్లో ఎలా ఆడారనే విశ్లేషణలు అందించాం.

క్లబ్, జాతీయ జట్టు తరఫున స్టార్ ప్లేయర్లు ఏ విధంగా ఆటతీరు ప్రదర్శించారు? ఎన్ని గోల్స్ చేశారు? అనేవి యాడ్ చేశాం.


ఇప్పుడున్న ఆటగాళ్ల నాణ్యత, భవిష్యత్ సామర్థ్యం, మార్కెట్‌లో విలువను వంటి విషయాలను పొందుపరిచాం. వాస్తవ మార్కెట్ విలువను అంచనా వేయడానికి ట్రాన్స్‌ఫర్ మార్కెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులోని సమాచారం తీసుకోవడం జరిగింది.

# అండర్ 19 స్క్వాడ్‌లో ద్రవిడ్ కొడుకు

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ అండర్ 19 స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. శ్రీలంక పర్యటనలో జులై 4 నుంచి జులై 23 మధ్య భారత్ మూడు వన్డే మ్యాచ్‌లు, రెండు మల్టీడే మ్యాచ్‌లు ఆడనుంది. ఈక్రమంలో గురువారం ప్రకటించిన వన్డే స్క్వాడ్‌లో అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన యశ్వీర్ గౌడ్‌కు కూడా ఇందులో చోటు లభించింది. యశ్వీర్ గౌడ్‌ను ఇటీవల టీజీ20 వేలంలో 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' జట్టు కొనుగోలు చేసింది. అండర్ 19 వన్డే, మల్టీడే మ్యాచ్‌లకు యశ్‌వర్ధన్ సింగ్ చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

# 14 టీంలు, 48 రోజులు.. వన్డే ప్రపంచకప్ 2027 డేట్స్ ఫిక్స్..

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్-2027 షెడ్యూల్ ఎట్టకేలకు వచ్చేసింది. 2027 అక్టోబర్ 4 నుండి నవంబర్ 21 వరకు 48 రోజుల పాటు ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జరనున్నట్టు తెలుస్తోంది. తాజాగా అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ తేదీలను ఖరారు చేసినట్టు సమాచారం. క్రికెట్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదరుచూస్తున్న ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్ కప్ తాత్కాలిక షెడ్యూల్ వచ్చేసింది. అక్టోబర్ 4 నుండి నవంబర్ 21 ఈ మెగా టోర్నీ జరగనున్నట్టు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలలో ఈ మ్యాచ్‌లు జరగనున్నట్టు తెలుస్తోంది. గత నెలలో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐసీసీ బోర్డు మీటింగ్ ఈ తేదీలపై ఏకాభిప్రాయం కుదిరిందని.. జూలైలో ఎడిన్‌బర్గ్‌లో జరగబోయే ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నివేదిక ప్రకారం..ఈ మెగా టోర్నీలోని మెజారిటీ మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నట్టు తెలుస్తోంది. ఈ టోర్నమెంట్ మొత్తంలో 54 మ్యాచ్‌ల జరగనుండగా అందులో సుమారు 41 మ్యాచ్‌లుకు దక్షిణాఫ్రికాలోని 8 స్టేడియాలు ఆతిత్యం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇక జింబాబ్వేలోని విక్టోరియా ఫాల్స్, హరారే స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్ స్టేయాల్లో 8 నుండి 10 మ్యాచ్‌లు జరగనుండగా మిగతా మూడు మ్యాచ్‌లు నమీబియాలో జరగనున్నాయి.



విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com